RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 39 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | ఆదివారం 17-5-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



# ప్రక్షాళనకు రేవంత్ రెడ్డి రెడీ.?

## - హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ కోసం వెయిటింగ్

**హైదరాబాద్** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు కావస్తుంది. ఇప్పటికీ మంత్రివర్గంలో పూర్తిగా భర్తీ చేయలేదు. ఇంకా మంత్రివర్గంలో రెండు స్థానాలు ఖాళీలున్నాయి. ఎప్పటికప్పుడు మంత్రివర్గంలో ఖాళీలను భర్తీ చేస్తామని ఊరిస్తూనే ఉన్నారు. కానీ ఇంతవరకూ భర్తీ చేయకపోవడంతో ఆశావహుల్లో నిరాశ కలుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చించడానికి అంటూ ప్రచారం జరుగుతుండటం, రేవంత్ రిక్త హస్తాలతో తిరిగి రావడం సాధారణంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అవి పూర్తయిన తర్వాతనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీలో ప్రచారం జరుగుతుంది. తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. ఇక గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ తో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఉన్న మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రెండున్నరేళ్లు కొందరికి మంత్రిగా అవకాశం కల్పించాం కాబట్టి, వారిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని నియమించుకోవాలన్నది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. ఇది పూర్తి స్థాయి ఎన్నికల టీంగా రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అందుకు హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ అందాల్సి ఉంటుంది. ప్రస్తుత మంత్రివర్గంలో సామాజికవర్గం పరంగా కొందరిని తప్పించాల్సిన పరిస్థితులున్నాయి. అలాగే పనితీరు ఆధారంగా మరికొందరిని బయటకు పంపాల్సిన అవసరం ఉంది.

అలాగే 2028 ఎన్నికల్లో పార్టీకిమంచి ఊపు తెచ్చే వారిని ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలన్న భావనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ప్రధానమైన వారిని కొందరిని అలాగే ఉంచి జిల్లాల వారీగా కొందరిని మార్చి, కొత్త వారికి అవకాశాలను కల్పిస్తే అందరికీ అవకాశం దొరికినట్లవుతుందని, అప్పుడు అసంతృప్తి, అసహనాలు ఉండవన్న అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు.

# నా వ్యాఖ్యలను వక్రీకరించారు

## - జస్టిస్ సూర్యకాంత్ ఆవేదన



**న్యూఢిల్లీ** కొంతమందిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన వివరణ ఇచ్చారు. నకిలీ, బోగస్ డిగ్రీలతో ఈ వృత్తిలోకి వచ్చేవారిని ఉద్దేశిస్తూ తాను ఆ వ్యాఖ్యలు చేశానని అన్నారు. ఇలాంటి వారే మీడియా, సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నారు. అందుకే అలాంటి వారిని పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ యువత పట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిన్న ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని పేర్కొన్నారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తన పట్ల వారికి గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

తెలంగాణలో 25 ఏళ్ల తర్వాత

# ‘ఎస్ఐఆర్’

## - జూన్ 15 నుంచి ప్రక్రియ షురూ



**హైదరాబాద్** తెలంగాణలో వచ్చే నెల 15 నుంచి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ‘ఎస్ఐఆర్’ ప్రక్రియకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన మీడియాతో పంచుకున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు అధికారులు, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ప్రతి

2లో..

# డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ టాప్

## - ప్రజాస్వామ్యానికి మనది మాతృదేశమన్న ప్రధాని

**న్యూఢిల్లీ** నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన సమావేశంలో భారత పురోగతి, ప్రపంచ సవాళ్లు, భారత్– నెదర్లాండ్స్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం చూస్తుంటే తాను భారత్‌లోని ఏదో పండుగలో పాల్గొన్నట్లుగా అనిపించిందని ప్రధాని వ్యాఖ్యానించారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్

2లో..



# చట్టం ముందు తన బిడ్డయినా, సామాన్యుడైనా ఒకటే

- నా కుమారుడ్ని పోలీసులకు అప్పగించానన్న బండి సంజయ్
- బండి భగీరథ్ ఏ తప్పు చేయలేదని భగీరథ్ చెబుతున్నాడన్న సంజయ్
- బెయిల్ వస్తుందని లాయర్లు చెప్పారన్న కేంద్ర మంత్రి



**హైదరాబాద్** తన కుమారుడు బండి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. చట్టంపై ఉన్న గౌరవంతో లాయర్ల ద్వారా బండి భగీరథ్‌ను పోలీసుల విచారణకు అప్పగించినట్లు బండి సంజయ్ కుమార్ తెలిపారు. చట్టం ముందు తన బిడ్డయినా, సామాన్యుడైనా ఒకటేనని, అందరం చట్టానికి లోబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. తన కుమారుడు ఏ తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడని, వాస్తవానికి బాధితుల నుంచి ఫిర్యాదు రాగానే అతనిని పోలీస్ స్టేషన్‌లో అప్పగిద్దామని భావించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ లోపు లాయర్లను సంప్రదించి తమ వద్ద ఉన్న ఆధారాలను వారి ముందు ఉంచామని బండి సంజయ్ తెలిపారు. ఆ ఆధారాలను చూసిన లాయర్లు.. కేసు కొట్టేస్తారని, బెయిల్ తప్పకుండా వస్తుందని చెప్పడం వల్లే పోలీసుల ముందుకు రావడంలో కొంత జాప్యం జరిగిందని కేంద్ర మంత్రి వివరించారు. ఈ రోజు కూడా బెయిల్ వస్తుందని లాయర్లు చెబుతున్నప్పటికీ, ఇకపై మరింత ఆలస్యం చేయడం సరికాదనే ఉద్దేశంతోనే తన కుమారుడిని తీసుకొచ్చి న్యాయవాదుల ద్వారా పోలీసుల విచారణకు స్వయంగా అప్పగించినట్లు స్పష్టం చేశారు. సోమవారం నాడు కోర్టు నుంచి కీలక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ, న్యాయ వ్యవస్థపై ఉన్న సంపూర్ణ నమ్మకం, గౌరవంతోనే ముందే విచారణకు పంపించినట్లు బండి సంజయ్ పేర్కొన్నారు. న్యాయస్థానంలో తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత్‌లో తొలిసారి

# పట్టుబడిన ‘జీహాదీ’ డ్రగ్

- మాదకద్రవ్యాల నిరోధక ఆపరేషన్‌లో భాగంగా జిహాదీ డ్రగ్ గుర్తింపు
- రూ.182 కోట్ల విలువైన క్యాప్టగన్ ట్యాబ్లెట్ల గుర్తింపు
- సిరియా అంతర్యుద్ధం సమయంలో ఉపయోగించిన ఐసిస్ ఉగ్రవాదులు



**న్యూఢిల్లీ** దేశంలో తొలిసారి భారీ ఎత్తున జీహాదీ డ్రగ్ పట్టుబడింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగా వివాదాస్పద సింథటిక్ డ్రగ్ ‘క్యాప్టగన్’ను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం ప్రకటించారు. ‘ఆపరేషన్ రేజ్‌పిల్’లో భాగంగా నిర్వహించిన సోదాల్లో దాదాపు రూ.182 కోట్ల విలువైన ‘క్యాప్టగన్’ ట్యాబ్లెట్లను గుర్తించినట్లు తెలిపారు. ఢిల్లీలోని నెబ్ సరాయ్ ప్రాంతంలో ఎన్సీబీ మే 11న ఈ ఆపరేషన్ నిర్వహించింది. ఢిల్లీలో 31.5 కిలోల క్యాప్టగన్ టాబ్లెట్లు దొరికాయని, వీటిని చపాతీ కటింగ్ మెషీన్‌లో రహస్యంగా దాచిపెట్టారని అన్నారు. జెడ్డా, సౌదీ అరేబియా గల్ఫ్ దేశాలకు ఈ డ్రగ్స్‌ను అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించినట్లు అమిత్ షా తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ రవాణాతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిరియా పౌరుడ్ని అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. టూరిస్ట్ వీసాపై 2024 నవంబరు 11న భారత్‌కు వచ్చాడని, జనవరి 1, 2025తో గడువు ముగిసినా అక్రమంగా దేశంలో ఉన్నట్టు

2లో..

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సామాన్యుల పాలిట పిడుగుపాటు

## - ఇది విశ్వాస ఘాతుకం అన్న సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్** దేశంలో పెట్రోల్,డీజిల్ ధరల పెంపుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి అని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచం అని ఎన్నికలకు ముందు పదేపదే ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ఫలితాలు వెలువడిన పది రోజుల్లోనే పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అభిప్రాయపడ్డారు. రూ. 3కు పైగా పెట్రోల్,డీజిల్ ధరలు పెంచడంవిశ్వాస ఘాతుకం అని అభిప్రాయపడ్డారు. ఇకనైనా ప్రధాని నరేంద్రమోడీ పెట్రోల్,డీజిల్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ‘ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదు. ఈ నిర్ణయం అనేక రంగాల పై వ్యతిరేక ప్రభావం చూపుతుంది. నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుంది’అని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఆత్మ నిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదు అన్నది తేలిపోయింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించింది. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలింది. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోంది. ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరింది’అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ‘ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే. ప్రపంచంలో భారత్ ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా

2లో..

పోలీసుల ఎదుట లొంగిపోయిన

# బండి భగీరథ్

## - న్యాయవాదుల సమక్షంలో అప్పగించిన కుటుంబసభ్యులు



**హైదరాబాద్** తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. బండి భగీరథ్‌ను ఆయన కుటుంబసభ్యులు న్యాయవాదుల సమక్షంలో పేట్ బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం విచారణకు హాజరవుతానని చెప్పిన బండి భగీరథ్ విచారణకు హాజరు కాలేదు. మరోవైపు బండి భగీరథ్ దేశం విడిచి వెళ్లకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు. అతడి కోసం ఐదు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే శనివారం బండి భగీరథ్‌ను అతని కుటుంబసభ్యులు పోలీసులకు

2లో..

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana



## ప్రపంచ తెలుగు సాహిత్య మహా సభలో

# పాల్గొనేందుకు ఆహ్వానం

పటాన్ చెరు, మే 16, (తెలంగాణ వాణి రిపోర్టర్)లి అమీన్ పూర్ లో నివాసం ఉంటున్న విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు న్యాలకంటి మానయ్య కు ప్రపంచ తెలుగు మహాసభల కు ఆహ్వానం అందింది. వచ్చే నెలలో ఆంధ్ర ప్రదేశ్ రాజమండ్రి లో జరిగే ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనాలని ఏ రోజు ఆహ్వానం అందింది. తనకు ఆహ్వానం రావడం పట్ల ఆయన తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని

# ఆకస్మిక తనిఖీ చేసిన "ప్రభుత్వ విప్"





నకిరేకల్ : మే 16 (తెలంగాణ వాణి) నకిరేకల్ పరిధిలోని చీకటి గూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ వేముల వీరేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, తూకం విధానం తదితర అంశాలను పరిశీలించిన అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కురుమూర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన మరో ధాన్యం నిల్వ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. చివరి గింజ వరకు కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు. దళారుల ప్రమేయం లేకుండా చూడాలి. అని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ " రైతుల పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కడం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుంది. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం " అని తెలిపారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పరిశీలించిన ప్రభుత్వ విప్పు వీరేశం రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. నిల్వ సామర్థ్యం పెంచడం, రవాణా సౌకర్యం కల్పించడం, తక్షణ తూకం వేయడం వంటి అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మరియు పౌరసరఫరా శాఖ అధికారులు, స్థానిక సర్పంచులు, నాయకులు, రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి
- కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం
- జిల్లా కలెక్టర్ :హేమంత్ కేశవ్ పాటిల్



**అచ్చంపేట మే 16 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి)** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం కొనుగోలు విధానం, తూకాలు, రికార్డుల నిర్వహణ, నిల్వల సదుపాయాలు, హమాలీ, రవాణా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు.కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హమాలీ కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటినివెంటనేపరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రతి గింజకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా ధాన్యం స్వీకరణ వేగవంతం చేయాలని సూచించారు. తూకాల్లో ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితత్వంతో వ్యవహరించాలని, రైతుల నమ్మకాన్ని నిలబెట్టేలా పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు పూర్తైన వెంటనే సంబంధిత ప్రక్రియలు పూర్తి చేసి రైతుల బ్యాంకు ఖాతాల్లో త్వరితగతిన చెల్లింపులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు కల్పించాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా రైతులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం నిల్వలో నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.తనిఖీలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి

**తుగ్గలి:** కూటమి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో "పల్లె పండుగ" కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం గ్రామాలలో మౌలిక వసతులను బలోపేతం చేయడానికి రోడ్డు నిర్మాణాలను చేపట్టింది.పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రోడ్డు నిర్మాణాలను చేపట్టిన గ్రామాలలో శనివారం రోజున అధికారులు తనిఖీలు చేపట్టారు.తుగ్గలి మండల పరిధిలోని గల గిరిగేట్ల,తుగ్గలి,రాంపురం గ్రామాల యందు నిర్మించిన సిసి రోడ్లను పత్తికొండ ఏపీడి లక్ష్మన్న,క్వాలిటీ కంట్రోల్ జేఈ మాధవ ప్రసాద్, పిఆర్ఏఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ తనిఖీలో భాగంగా వారు రోడ్డు నాణ్యతను,పొడవు,వెడల్పులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతే ప్రామాణికంగా తీసుకొని రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని వారు తెలియజేశారు.రోడ్ల నిర్మాణ నాణ్యత విషయంలో లోపాలు ఏర్పడితే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఈసీ రాజశేఖర్,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రవి, కుమార్,ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

# కొంత ప్రైవేటీకరణతోనే ఆర్టీసీకి ఊరట

## - ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ

**మచిలీపట్నం** రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ స్పష్టం చేశారూ ... కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ, ఒక్కో బస్సు ధర సుమారు రూ. 1.60 కోట్ల నుండి రూ. 1.70 కోట్ల వరకు పలుకుతోందని తెలిపారు.?ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి బస్సులను కొనుగోలు చేయడం ప్రస్తుతానికి ఆర్టీసీ లేదా ప్రభుత్వానికి సాధ్యం కాని పని అని ఆయన అభిప్రాయపడ్డారు. దీనికి బదులుగా బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తే, వారే పెట్టుబడులు పెట్టి, బాడీ బిల్డింగ్ చేయించుకుని బస్సులను నడుపుతారని, దీనివల్ల ఆర్టీసీపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని వివరించారు.?ఆర్థిక భారం.. ఎలక్ట్రిక్ బస్సుల ఆవశ్యకత?ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 10వేల బస్సులు నడుస్తున్నాయని, వాటన్నింటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలంటే దాదాపు రూ. 15, వేల కోట్లు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పెరిగిందని, ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆపరేటర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు.?అయితే, ప్రయాణికులకు ఛార్జీలు పెంచే ఆలోచన ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చు చాలా తక్కువని ఆయన వివరించారు?ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, నిర్వహణ వ్యయం తగ్గి ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. రాబోయే రెండు నెలల్లో ఈ బస్సులు అందుబాటులోకి వస్తాయనీ చెప్పారు

# మహిళ హత్య



**తిరువూరు** ఖమ్మం జిల్లా మధిర పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కృష్ణాపురంనక్కలగరుబు రోడ్డుమధ్యలో ఉన్న ఓ ప్రైవేట్ వెంచర్ ప్రాంతంలో మహిళ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం, మృతురాలు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరు గ్రామానికి చెందిన జి. కల్పన(28)గా గుర్తించారు. ఆమె మధిరలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు సమాచారం. గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసి అక్కడ పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.సమాచారం అందుకున్న మధిర రూరల్ సీఐ మధు, రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని ఆర్కే ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# పాడి రైతులు ఇంధన పొదుపు చేయాలి

**హనుమాన్ జంక్షన్** ప్రధాని, ముఖ్యమంత్రి సూచనలతో ఇంధన పొదుపు చర్యలు కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు చేపట్టారు. పాడి రైతులతో కలిసి అయన సైకిల్ యాత్ర చేసారు. హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంతాల గ్రామాలకు సైకిల్పై ప్రయాణం సాగిస్తూ పాడి రైతులతో మాట్లాడారు. "పాడి రైతు సంక్షేమం మన మతం – అలుపెరగని సేవ మన అభిమతం" అనే కార్యక్రమంలో పాల్గొని ఇంధన పొదుపు చర్యలు ను రైతులకు వివరించారుఏ.చలసాని ఆంజనేయులు మట్లాడుతూ రైతుల సమస్యలు, పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు సంక్షేమం, సహకార రంగ బలోపేతంపై నే మా ఆలోచన. సమితి చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందరూ తెలుసుకోవాలి. రైతులు అందరూ వారానికి ఒకరోజు ఇంధన పొదుపు చేస్తూ సైకిల్, ఇతర ఇంధనేతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ రోజువారీ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అన్నారు. ఇంధన పొదుపు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. పర్యావరణ హిత జీవన విధానాలను అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ



**తిరుపతి** మే 16 "జాతీయ డెంగ్యూ దినోత్సవం" సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జీ.కే. రూప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.బాల కృష్ణ నాయక్ జండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద పద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థినులు " మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. విద్యార్థినులు, సిబ్బంది మరియు జిల్లా అధికారులతో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నిర్మూలన కొరకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధిఈడిస్ ఈజిప్టై అనే దోమ కాటు వలన వస్తుందని, ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా వస్తుందని, ఈ వ్యాధి నియంత్రణకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు కొబ్బరి బోండాలు ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని, ఇంటి కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని,దోమల బ్యాట్లు రిపలెంట్లు వాడాలని,పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డిప్యూటీ డెమో బలరామరాజు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఎం పి హెచ్ ఈ ఓ లు,పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు,( మగ, ఆడ), కార్యాలయ సిబ్బంది, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిసరాలు అందరూ శుభ్రంగా ఉంచుకోవాలి

## - మండల అధికారి అమీరున్నిసా బేగం



**ఆత్మకూరు**దకొత్తపల్లి మండలం గువ్వలగుంట్ల గ్రామంలో 3 వ శనివారం జరిగిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో గువ్వలగుంట్ల గ్రామ పంచాయతీ కి స్పెషల్ ఆఫీసర్ అయిన మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజాన్ని రూపొందించేందుకు ప్రజలు సహకరించాలని అని పిలుపునిచ్చారు అదేవిధంగా మనం ఆరోగ్యంగా ఉండాలంటే మొదటగా మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత అనేది మన జీవితంలో చాలా ముఖ్యం. మన ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు రాకుండా మనం నియంత్రించవచ్చు. అంతేకాదు, పరిశుభ్రంగా ఉన్న చోట మనసుకు ప్రశాంతత కూడా ఉంటుంది అనిఆమె తెలిపారు.పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంని తగ్గించాలి. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ సిబ్బంది, ప్రజలు,పాల్గొన్నారు.

# పోలీసుల ఎదుట లొంగిపోయిన బండి భగీరథ్

అప్పగించారు.మరోవైపు తెలంగాణ హైకోర్టు కూడా బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన సంగతి తెలిసిందే. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. శుక్రవారం రాత్రి 9 నుంచి 12 గంటల వరకూ సుదీర్ఘ విచారణ అనంతరం ఈ దశలో బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. మరోవైపు ఈ కేసులో బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు శనివారం మరోసారి రికార్డు చేశారు. మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట బాధితురాలితో పాటుగా ఆమె తల్లి వాంగ్మూలం 40 నిమిషాల పాటు నమోదు చేశారు. ఈ కేసులో బాధితురాలి వాంగ్మూలాలను పోలీసులు ఇప్పటి వరకూ రెండుసార్లు నమోదు చేశారు.మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో భగీరథ్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు 17 ఏళ్ల బాలిక ఫిర్యాదు మేరకు మే 8న కేసు నమోదు అయ్యింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 11, 12లతో పాటు బీఎన్ఎస్‌లోని 74, 75 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ విచారణ సాగుతున్న సమయంలోనే తనను బ్లాక్ మెయిల్ చేసి ఫిర్యాదురాలి కుటుంబం డిమాండ్ చేసిందని బండి భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారు. తర్వాత ఈ రెండు విచారణలకి కూడా ఆయన హాజరుకాలేదు. భగీరథ్ పేట్ బషీరాబాద్ పోలీసులు ఎదుట లొంగిపోవడంతో ఒక హైడ్రామాకు తెరపడింది. ఇప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతుంటే, న్యాయస్థానం ఇచ్చే తుది తీర్పుపై అందరి దృష్టి నెలకొంది. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తారా లేదా అన్నది మరికాసేపట్లో క్లారిటీ రానుంది.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు సామాన్యుల పాలిట పిడుగుపాటు

ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుంది!?'అని ప్రధాని నరేంద్రమోడీ నిలదీశారు.'ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం "పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం" అని పదే పదే ప్రకటించింది. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారు. ఇది విశ్వాస ఘాతుకం అవుతుంది'అని సీఎం ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలి అని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# భారత్‌లో తొలిసారి పట్టుబడిన 'జీహాదీ' డ్రగ్

గుర్తించారు. అతడి ఇచ్చిన సమాచారం ఆధారంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్ట్‌లో మే 14 సోదాలు నిర్వహించి, మూడు బ్యాగుల్లో దాచిన 196.2 కిలోల టాబ్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టినట్టు పేర్కొన్నారు.అత్యంత చౌక ధరకు లభించే 'క్యాప్టగన్'ను 'జిహాదీ డ్రగ్', 'పేదవాడి కొకైన్'గా పిలుస్తారు. పశ్చిమాసియా దేశాలు, యుద్ధ ప్రాంతాల్లో ఈ డ్రగ్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. సిరియా అంతర్యుద్ధం సమయంలో ఐసిస్ ఉగ్రవాదులు పెద్ద ఎత్తున దీనిని ఉపయోగించారు. ఈ డ్రగ్‌ను తీసుకుంటే ఎక్కువ గంటలు నిద్ర లేకుండా ఉండటం, అలసట, భయం లేకపోవడం వంటి ప్రభావాలను కలిగిస్తుంది. అందుకే దీనిని 'జిహాదీ డ్రగ్' అని అంటారు. 1960 దశకంలో దృష్టిలోపం, నార్కోలెప్సీ ఉన్న రోగులకు చికిత్సలో ఈ ఔషధాన్ని ఉపయోగించేవారు. అయితే, దీనిని ఉపయోగిస్తే ఆ మత్తు అలవాటుగా మారుతుందని చాలా దేశాలు నిషేధించాయి. కానీ ఇది అసలైంది కాదు. ప్రస్తుతం బ్లాక్ మార్కెట్‌లో మాత్రమే లభిస్తోంది. ఈ డ్రగ్‌లో రహస్యంగా యాంఫెటమైన్, మెతాంఫెటమైన్ వంటి హానికారక రసాయనాలను కలుపుతున్నారు.ఈ డ్రగ్ తీసుకున్న తర్వాత కొద్దిసేపు ఉత్సాహంగా ఉన్నప్పటికీ దీర్ఘకాలికంగా తీవ్ర మానసిక సమస్యలు, హింసాత్మక ప్రవర్తన వంటి దుష్పరిణామాలను కలిగిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈక్వెడార్ నుంచి వచ్చిన ఒక కంటైనర్‌లో దాచి ఉంచిన 349 కిలోగ్రాముల కొకైన్‌ను ముంబయిలో ఇటీవల పట్టుబడిన నేపథ్యంలో తాజా ఘటన ప్రాధాన్యతను సంతరించుకుంది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కోసం అంతర్జాతీయ సిండికేట్లు వాణిజ్య సరుకులను, కంటైనర్ల ద్వారా జరిగే వ్యాపార మార్గాలను వినియోగించుకుంటున్నారనడానికి ఇదో ఉదాహరణ. ఈ సిండికేట్‌కు సంబంధించిన సేకరణ మూలాలు, ఆర్థిక మరియు హవాలా సంబంధాలు, లాజిస్టిక్స్ మధ్యవర్తులు, అంతర్జాతీయ స్వీకర్తలు, మరియు విస్తృత అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను గుర్తించడానికి ఎన్‌సిబి ఒక సమగ్ర దర్యాప్తును ప్రారంభించింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగం అనే ప్రపంచ సమస్యకు సామూహిక ప్రతిస్పందనను నిర్ధారించడానికి, నిఘా సమాచార మార్పిడి, మాదకద్రవ్యాల కింగ్‌పిన్‌ల అప్పగింత, మరియు మాదకద్రవ్య ఉగ్రవాదం, డ్రగ్ కార్టెల్స్‌పై సమన్వయ చర్యల ద్వారా అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడానికి భారతదేశం కట్టుబడి ఉంది.

# తెలంగాణలో 25 ఏళ్ల తర్వాత 'ఎస్ఐఆర్'

ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారని సుదర్శన్ రెడ్డి వివరించారు. ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు అందుతాయన్నారు. అందులో ఒకటి నింపి తిరిగి బీఎల్‌వోలకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రెండో ఫామ్‌ను ఓటరు తమ వద్దే అక్‌నాలెడ్జ్‌మెంట్ కింద ఉంచుకోవచ్చని వివరించారు. ఆన్‌లైన్‌లో ఓటర్ల నమోదు కోసం వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్యుమరేషన్ ఫామ్‌ల ఆధారంగా జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. దీన్ని రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. అలాగే వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్‌పై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలియజేయొచ్చని సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించిన తర్వాత అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు. తెలంగాణలో దాదాపు 25 ఏళ్ల క్రితం ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియ జరిగిందని గుర్తుచేశారు.

# డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ టాప్

డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి.కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

# పెట్టికోటలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం...




**కొలిమిగుండ్ల** కొలిమిగుండ్ల మండలంలోని పెట్టికోట గ్రామంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్ చంద్రమౌళీశ్వర గౌడ్ అధ్యక్షతన శనివారం నాడు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు పనిముట్లు, యూనిఫామ్ క్లాత్, హ్యాండ్ గ్లౌజులు మరియు గ్రామంలో ఉన్న ఇంటింటికి చెత్త సేకరణ కోసం ప్రజలకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. పెట్టికోట గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని స్పెషలాఫీసర్ చంద్రమౌళీశ్వర గౌడ్ గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా తడి చెత్తను పొడి చేతను ఇంటి వద్దనే వేరు చేసి గ్రామ ప్రజలు పారిశుద్ధ కార్మికులకు అందజేయాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుస్సేన్ రెడ్డి, గొంగటి నారాయణరెడ్డి, నాగిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ అధికారులు ఎన్ సుబ్బారావు, జి బాలాజీ మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిట్ పేపర్ లీకేజీ నిందితుల అరెస్టు చేయాలి

- పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా
- ప్రధాని దిష్టిబొమ్మ దహనం.
- కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్



**కోరుట్ల:మే 16 (తెలంగాణ వాణి)** ఇటీవల జరిగిన నీట్ పరీక్ష లీకేజ్ కావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన ప్రజా ప్రతినిధులు అధికారులను అరెస్టు చేయాలని కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా చేపట్టి ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సంద ర్భంగా కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడం మంచిది కాదని నీట్ పేపర్ లీకేజీ కి పాల్పడిన ప్రజా ప్రతినిధులను అధికారం వెంటనే అరెస్టు చేయాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు,కాంగ్రెస్ నాయకు లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ గేమ్స్‌లో బంగారు పతకాలు సాధించిన ఏసిపి ని ఘనంగా సన్మానించిన మాస్టర్ క్రీడాకారులు




జమ్మికుంట:మే 16 (తెలంగాణ వాణి) ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన అఖిల భారతీయ పోలీస్ క్రీడా పోటీల్లో హుజూరాబాద్ ఏసిపి వి.మాధవి టేబుల్ టెన్నిస్,బ్యాడ్మింటన్ లలో అత్యంత ప్రతిభను కనబరిచి బంగారు పతకాలు సాధించిన సందర్భంగా మాస్టర్ క్రీడాకారులు శనివారం తన కార్యాల యంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి, పూల గుచ్ఛాన్ని అందజేసి ఘనంగా సన్మానించి శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ క్రీడాకారులు మాట్లాడుతూ పోలీస్ శాఖ విధినిర్వాహన లో బిజీ గా ఉంటూ ప్రజలకు నిరంతం సేవలందించడంతో పాటు,తనకున్న క్రీడారంగం పట్ల మక్కువతో సాధన చేస్తూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకాలు సాధించడం గర్వ కారణమని అన్నారు.ఏసిపి మాధవి మహిళలకే కాకుండా నేటి యువతకు ఆదర్శమని అన్నారు.క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా తమకు ఉన్న నైపుణ్యాన్ని రుజువు చేసుకోవడానికి మంచి వేదిక ను తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మారేపల్లి మొగిలయ్య, అంతర్జాతీయ క్రీడాకారులు వంతడుపుల రఘు,డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు) మంద జగన్, మామిండ్ల మల్లయ్య తదిత రులు పాల్గొన్నారు.

## కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా

# తిరుమల గంగాధర్



కోరుట్ల:మే 16 (తెలంగాణ వాణి) కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ నియమించారు. ఏఐసీసీ,పీసీసీ ఇచ్చిన ప్రతి పిలుపు మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా తిరుమల గంగాధర్ ను తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, జువ్వాడి శేఖర్ రావు ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య శనివారం జగిత్యా ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో నియామక పత్రాన్ని అందజేశారు.స్వర్గీయ జువ్వాడి రత్నాకర్ రావు ప్రియ శిష్యునిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తెలుపు మేరకు పట్టణంలో ప్రతి కార్యక్రమాన్ని విజయ వంతం చేస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్న తిరుమల గంగాధర్ కు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకం పట్ల కోరుట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జువ్వాడి కుటుంబానికి నమ్మిన బంటు లా ఉంటూ పార్టీ కష్ట కాలంలో కూడా ప్రజలతో మమేకమై కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్తున్న తిరుమల గంగాధర్ కు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నియామకం కావడం అదృష్టంగా భావిస్తు న్నట్టు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పార్టీలో కష్టపడ్డ వారికే పదవులు దక్కుతా యని గతంలో చాలాసార్లు పత్రిక ముఖంగా తెలియ జేశారు.దీంతో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకం కావడం పట్ల అది నిజమైనట్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో కష్టపడ్డ వారికి తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందనదానికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు.ఈ సందర్భం గా కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన తిరుమల గంగాధర్ మాట్లా డుతూ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా తనపై నమ్మ కంతో నియమించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి జిల్లా కాంగ్రెస్ పార్టీకి జువ్వాడి బ్రదర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే ప్రతి కార్యక్రమాన్ని పట్టణంలో విజయవంతం చేయడానికి తన వంతు తప్పకుండా కృషి చేస్తానని తెలిపారు.

# ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

- తరుగు పేరుతో రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు
- కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యల
- 67 కొనుగోలు కేంద్రాలకు ప్రత్యేక అధికారుల నియామకం
- జిల్లా కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి బ్యూరో మే 16 (తెలంగాణ వాణి)** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన 167 కొనుగోలు కేంద్రాలకు 167 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి జాప్యం చోటుచేసుకోకుండా ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, తార్పాలిన్లు, తూకం యంత్రాలు, హమాలీలు, రవాణా సదుపాయాలు తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులు తీసుకువచ్చే ధాన్యం, మొక్కజొన్నను వేగవంతంగా కొనుగోలు చేసి వెంటనే నిల్వ కేంద్రాలకు తరలించే విధంగా సమన్వయ చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో మొత్తం 94,198 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరగగా, సుమారు 2,44,915 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేయబడిందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,400 చొప్పున రైతులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాకు సంబంధించి 94,822 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 11 కొనుగోలు కేంద్రాల ద్వారా 32,546.350 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నలో 19,595.350 మెట్రిక్ టన్నులను ఇప్పటికే గోదాములకు తరలించామని, మిగిలిన 12,951 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా త్వరితగతిన తరలించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు పేరుకుపోకుండా అవసరమైన రవాణా సౌకర్యాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటూ నిరంతర లోడింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో గన్నీ సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా 6,50,927 గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. మొక్కజొన్న నిల్వ కోసం జిల్లాలోని కొదాడ, బాదలాపురం, మత్తంపల్లి, కుక్కడాం, కరేపల్లి, యెల్లందు, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి తదితర ప్రాంతాల్లోని శాస్త్రీయ గోదాములను గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 41,814 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాముల్లో ప్రస్తుతం 19,622 మెట్రిక్ టన్నుల స్థలం వినియోగంలో ఉండగా, ఇంకా 22,192 మెట్రిక్ టన్నుల ఖాళీ నిల్వ స్థలం అందుబాటులో ఉందన్నారు. ధాన్యం తేమ శాతం, తరుగు తదితర అంశాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ముఖ్యంగా రైస్ మిల్లర్లు తరుగు పేరుతో అనవసర కోతలు విధించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ఎటువంటి రాజీ ఉండదని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో అధిక స్థాయిలో ధాన్యం దిగుబడి నమోదవుతున్న నేపథ్యంలో నిల్వల కోసం ప్రత్యామ్నాయ స్థలాలను కూడా ప్రత్యేకంగా గుర్తించి సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న ఫంక్షన్ హాళ్లు, గోదాములు, పాఠశాల భవనాలను తాత్కాలిక నిల్వ కేంద్రాలుగా వినియోగిస్తూ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు .రైతులు ఎటువంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే సంబంధిత ప్రత్యేక అధికారులకు లేదా జిల్లా అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఆరుగాలంశ్రమించి పండించిన రైతుల పంటను ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

# నేటి నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం

## - కొద్ది రోజులు పెళ్లిళ్లకు సెలవ్



**హైదరాబాద్:మే 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)** హిందూ ధర్మశాస్త్రం ప్రకారం కాలగణనలో అధిక మాసం అత్యంత విశిష్టమైనది. సాధారణంగా శుభకార్యాలకు ఈ మాసం నిషిద్ధమని మనందరికీ తెలుసు.అయితే, లౌకిక సుఖాల కంటే ఆధ్యా త్మిక పురోభివృద్ధికి,దైవచింత నకు ఈ మాసం ఒక వరం వంటిది. "అధికస్య అధికం ఫలం" అన్న నానుడి ప్రకారం.. ఈ మాసంలో చేసే చిన్న పుణ్యకార్యమైనా వేయి రెట్లు ఫలితాన్ని ఇస్తుంది.2026వ సంవత్సరంలో మే 17వ తేదీ నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం కానుంది.ఈ అధిక జ్యేష్ఠమాసంలో ఏం చేయవ చ్చు.ఏం చేయకూడదో తెలు సుకుందాం.

### అసలు అధిక మాసం అంటే ఏమిటి?

సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించడాన్ని 'సంక్రాంతి' అంటారు.ఏ మాసంలో అయితే సూర్య సంక్రమణం జరగదో,ఆ మాసాన్ని అధిక మాసం అంటారు.శాస్త్రీయంగా చూస్తే, సౌరమానానికి (365 రోజులు), చాంద్రమానానికి (354 రోజులు) మధ్య ఉండే 11 రోజుల తేడాను సరిచేయ డానికి ప్రతి 33 నెలలకు ఒకసారి ఒక నెలను అదనంగా చేరుస్తారు.ఇదే అధిక మాసం.పురుషోత్తమ మాసం వెనుక ఉన్న పరమార్థం పురాణాల ప్రకారం,ఈ మాసానికి అధిపతి లేకపో వడంతో దీనిని అందరూ నిరసించేవారట.అప్పుడు శ్రీమహావిష్ణువు కరుణించి,ఈ మాసానికి తన పేరైన పురు షోత్తమ'నామాన్ని ఇచ్చి, దీనికి అధిపతిగా మారారు. అందుకే ఈ నెలలో విష్ణు మూర్తి ఆరాధన అనంతమైన ఫలితాలనిస్తుంది.ఈ అధిక మాసంలో పురుషోత్తముడైన శ్రీ మహావిష్ణువును విరాజ మానంగా ఆరాధిస్తారు. సత్యనారాయణ వ్రతాలు విరివిగా చేస్తారు.

### ఆలయంలో ఏమి చేయాలి? ఏమి చేయ కూడదు?

అధిక మాసంలో వివాహాలు, గృహప్రవేశాలు,ఉపనయ నాలు వంటి లౌకిక శుభకా ర్యాలు చేయకూడదు.కానీ, అంతకంటే గొప్పవైన పనులు తప్పనిసరిగా చేయాలని శాస్త్రం చెబుతోంది.ఈ మాసం లో ఇష్టదైవం నామస్మరణ, గాయత్రీమంత్రం జపం, నరసింహ కవచం వంటివి పఠించడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుంది. అంతేకాదు,ఈ మాసంలో పండ్లను,పిండి వంటలను, స్వయంపాకాన్ని దానం చేయడం వలన సుఖశాం తులు లభిస్తాయి.ముఖ్యంగా ద్వాదశి,పౌర్ణమి,అమావాస్య తిథుల్లో ఈ దానాలు చేయాలి.పితృదేవతల సద్గతి కోసం ఈ మాసమంతా సంధ్యాసమయంలో దీపం వెలిగించాలి.ఇలా చేయడం వలన పితృదేవతలు సంతోషించి కుటుంబానికి,వంశాభి వృద్ధికి సహకరిస్తారు.ఇక ఈ మాసంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు,నవగ్రహ హోమాలు,శాంతిపూజలు నిర్వహిస్తారు.ఒక్కమాటలో చెప్పాలంటే అధిక మాసం అంట విరామం అని అర్థం కాదు.భక్తికి ఇచ్చే అదనపు సమయం.బాహ్యమైన వేడుకలకు దూరంగా ఉంటూ అంతరంగంలో దైవాన్ని నింపుకోవడానికి ఇది ఓ మంచి అవకాశం.2026 మే 17 నుంచి ప్రారంభమయ్యే ఈ పురుషోత్తమ మాసంలో పుణ్యకార్యాలను చేద్దాం.ఆ స్వామివారి అనుగ్రహాన్ని పొందుదాం.

## కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం

# నిధులు మంజూరు చేయండి

- ప్రభుత్వ సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని కలిసిన జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల :మే 16 (తెలంగాణ వాణి) కోరుట్ల నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణా రావు,జగిత్యాల నియోజక వర్గ శాసనసభ్యులు డాక్టర్ ఎం.సంజయ్ కుమార్ తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజక వర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వేం నరేందర్ రెడ్డికి వివరించారు. ఇందుకు వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించిన ట్లు జువ్వాడి కృష్ణారావు విలేకరులకు శనివారం విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

## మృతికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్

**నకిరేకల్ : మే 16 (తెలంగాణ వాణి)** నకిరేకల్ పట్టణానికి చెందిన రాపోలు ధనలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా వారి మృతదేహానికి నకిరేకల్ ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ శ్రీ వేముల వీరేశం పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డి సి సి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత, మరియు నాయకులు తదితరులు పరామర్శించడం జరిగింది.



# మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలి
- అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం




**కరీంనగర్: మే 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)** కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగ వంతం చేసి లక్ష్య సాధన దిశగా సమన్వయంతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్డీవోలు,తహసీల్దార్లతో శనివారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మ్యాపింగ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దశను ప్రణాళి కాబద్ధంగా అమలు చేస్తూ ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయా లని సూచించారు.మ్యాపింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని, ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాల ని అధికారులకు పలు సూచ నలు చేశారు.

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలి**

**పెండింగ్ పనులు త్వరితగతి న పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం.**

కరీంనగర్‌లోని పద్మనగర్, ఆరేపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదా రులకు అందించేం దుకు అన్ని రకాలుగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనుల పురోగతి, మౌలిక సదుపాయాలు, పెండింగ్ అంశాలపై నిర్వ హించిన సమీక్షలో కలెక్టర్ కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి ఇండ్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలని పేర్కొన్నారు. విద్యుత్,నీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి అన్ని సౌకర్యాలను సిద్ధం చేయా లని అధికారులను ఆదేశిం చారు.పెండింగ్ పనుల పూర్తి చేసే అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సమయపాలనతో ముందుకెళ్లాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి శ్రీనివాస్ రెడ్డి కరీంనగర్ ఆర్డీఓ కె. మహేశ్వర్ తహసీల్దారులు లక్ష్మీ నరసింహారావు, నరేందర్ వెంకటలక్ష్మి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి సేవిస్తూ పట్టుబడిన

# నలుగురు యువకులు

**- రిహాబిలేటేషన్ సెంటర్ కు తరలించిన భద్రాచలం పోలీసులు**




భద్రాచలం (తెలంగాణ వాణి) గంజాయి సేవిస్తూ కట్టుబడిన నలుగురు యువకులను రిహాబిలిటేషన్ సెంటర్ కు తరలించిన భద్రాచలం పోలీసులు భద్రాచలం పట్టణంలో గంజాయి అక్రమ రవాణా,గంజాయి సరఫరా చేసే వ్యక్తులపై, సేవించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని భద్రాచలం ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం భద్రాచలం పట్టణంలో గంజాయి టెస్టింగ్ కిట్స్ ద్వారా చేపట్టిన తనిఖీలలో నలుగురు యువకులకు పాజిటివ్ రాగా,వారికి కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే భద్రాచలం పట్టణంలో గల దక్షత సొసైటీ జిల్లా మత్తు పదార్థాల వ్యసన పునరావాస కేంద్రానికి తరలించడం జరిగిందని సీఐ తెలిపారు.ఇకపై భద్రాచలం పట్టణంలో విస్తృతంగా మత్తుపదార్థాలు సేవించే వారిపై గంజాయి కిట్స్ ద్వారా తనిఖీలు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఎవరైనా గంజాయిని రవాణా చేస్తున్నట్లు గానీ, సేవిస్తున్నట్లు గానీ తెలిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కూడా వెల్లడించారు. మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.

## కార్మిక కుటుంబానికి అండగా నిలిచిన

# ఎమ్మెల్యే జిఎంఆర్

**- గుండెపోటుతో మరణించిన కార్మికుడి కుటుంబానికి 5 లక్షల 50 వేల రూపాయల నష్టపరిహారం అందజేత**



**పటాన్ చెరు, మే 16, (తెలంగాణ వాణి రిపోర్టర్)** కార్మిక రంగానికి పెద్దపీట వేస్తూ వారి సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తున్న పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మరో సారి కార్మిక రంగం పట్ల తన నిబద్ధతను చాటుకున్నారు. గుండె పోటుతో మరణించిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి మెరుగైన నష్టపరిహారం అందించి వారి కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలో గల స్మార్కో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో కాంటాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి (35) మూడు రోజుల క్రితం పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. అత్యంత నిరుపేద కుటుంబం నేపథ్యం కలిగిన కృష్ణారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని సూచించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పరిశ్రమ యాజమాన్యం 5 లక్షల రూపాయలు నష్టపరిహారంతో పాటు 50 వేల రూపాయలు అంత్యక్రియల ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం సాయంత్రం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం డబ్బులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక నేపద్యం నుండి రాజకీయాల్లోకి వచ్చిన తనకు కార్మికుల కష్టనష్టాలు తెలుసునని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కార్మిక రంగానికి ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా పటాన్ చెరు అధ్యక్షులు సుధీర్ రెడ్డి, పాశమైలారం వైస్ చైర్మన్ రాఘవరెడ్డి, ప్రతినిధులు ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, రమణారెడ్డి. లక్ష్మణరావు, సురేష్. రంజిత్, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, చంద్రశేఖర్, మధు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంద్రేశం మున్సిపాలిటీలో జనాభా లెక్కల గణన ను పరిశీలించిన అధికారులు





పటాన్ చెరు, మే 16, (తెలంగాణ వాణి రిపోర్టర్): జనాభా గణన లో భాగంగా ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ రేణుక, ఈ రోజు తమ పరిధిలోని హెచ్ ఎల్ బి నంబర్ 28 బచ్చుగూడ గ్రామాన్ని పరిశీలించారు. ఈ కార్య క్రమంలో ఎన్యూమరేటర్ శ్రీమతి పి జ్యోతి, బిల్ కలెక్టర్ వెంకటేశం, రేణుక, తదితరులు ఉన్నారు. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ ను చూసి వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

# పీవీకే 5 గనికార్మిక సమస్యలపై మేనేజర్‌తో ఐఎన్టీయుసి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్







**కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)** ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కొత్తగూడెం ఏరియాలో గల పీవీకే,5 గని కార్మికుల సమస్యల పై ఐ ఎన్ టీ యు సి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ గని మేనేజర్ శ్యాం ప్రసాద్ ను కలిసి చర్చించారు. శనివారం పీవీకే 5ఐ ఎన్ టీ యు సి ప్రతినిధి బృందం తో కలసి చర్చించడం జరిగినది. షిఫ్ట్ ఓర్ మెన్ రెస్ట్ రూమ్, క్యాంటీన్ సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకు రావడం జరిగినది. క్యాంటీన్ ప్రొవిజెన్స్ విషయాన్ని సూపర్ బజార్ ఎం డి తో కూడా మాట్లాడారు. దీంతో మేనేజర్ స్పందిస్తూ వెంటనే పై సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగినది. అనంతరం ఈ అండ్ఎం సూపర్ వైజర్ లు, టెక్నీషియన్ ల రెస్ట్ రూమ్ లకు వెళ్లి అందరిని మర్యాద పూర్వకముగా కలసి రావడం జరిగినది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారు పిట్ సెక్రటరీ చిలక రాజయ్య, సకినాల సమ్మయ్య, టి.నాగార్జున,జి. నవీన్, బండి సాయి, రాహుల్, చిరంజీవి, సీతారాం, కొమ్ము సాంబయ్య,బాలు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**- సాంస్కృతిక వారస త్వాన్ని కొనసాగించాలి - ఘనంగా ఆర్ట్,క్రాఫ్ట్,కల్చరల్ డే వేడుకల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**






కరీంనగర్:మే 16 (తెలంగాణ వాణి) విద్యార్థులు చదువు తోపాటు విభిన్న రంగాల్లో రాణించాలని,భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ఆర్ట్,క్రాఫ్ట్,కల్చరల్ దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలో సాంస్కృతిక వారసత్వానికి కళలకు నిలయమని అన్నా రు.విద్యార్థులు అన్ని రంగాల్లో ముందున్నప్పుడే వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని తెలి పారు.అడిషనల్ కలెక్టర్,జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో విద్యార్థుల అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు.విద్యార్థుల్లో సృజనా త్మకతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆర్ట్ క్రాఫ్ట్ మేళా వంటివి ఏర్పాటు చేశామని తెలిపారు.డ్రాయింగ్ కాంపిటీషన్,కళా ఉత్సవ్ వంటి కార్యక్రమాల్లో విద్యా ర్థులు చురుగ్గా పాల్గొన్నారని పేర్కొన్నారు.విభిన్న రంగాల్లో అనేక శిక్షణలు ఇప్పించామని అన్నారు.రానున్న విద్యా సంవత్సరంలోనూ విద్యార్థు లు అన్ని రంగాల్లో రాణించేలా పలు కార్యక్రమాలు రూపొంది స్తామని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఆర్ట్ క్రాఫ్ట్ ఎగ్జి బిషన్ ఆకట్టుకుంది. జవహర్ బాల భవన్,కస్తూరిబా పాఠ శాలలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, సమగ్ర శిక్ష అభియాన్ కోఆర్డినేటర్లు డి.శ్రీనివాస్, అశోక్ రెడ్డి,మిల్కూరి శ్రీనివాస్, ఉమారాణి,జవహర్ బాల భవన్ సిబ్బంది మంజుల,శ్రీధర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# చీకటి పాలన అంతం చేస్తేనే మళ్లీ వెలుగులు వస్తయ్

**- నా జన్మదినం ప్రజా జన్మదినంగా జరుపుకున్నదే నా ఆకాంక్ష**
**- ఓటు విలువ తెలువకనే అణగారిని వర్గాలుగా మిగిలిపోతున్నం**
**- 40ఏండ్లుగా ఒకే కుటుంబానికి ఓట్లేస్తే 40మందికి ఉద్యోగాలు ఇయ్యలే**
**- అభివృద్ధి చేసే అవకాశం మంత్రికి ఉన్నా ఆ దిశగా ఆలోచన చేయట్లే**
**- కాటారం, రుద్రారం నుంచే మార్పు మొదలు కావాలే**
**- వేలలో మెజార్టీ ఇస్తున్న అన్నాదమ్ములు అభివృద్ధి చేయట్లేదు**
**- బీఆర్ఎస్ పార్టీ..కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటాండ్లు**
**- జన్మదిన వేడుకల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**జయశంకర్ భూపాలపల్లి మే 16 (తెలంగాణ వాణి ప్రతినిధి )** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంథని నియోజకవర్గంలో చీకటి పాలన మొదలైందని, ఆ చీకటి పాలనను అంతం చేస్తేనే మళ్లీ వెలుగులు వస్తాయని, 2028లో నియోజకవర్గానికి వెలుగులు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో నియంతపాలన అంతం చేయడానికై మంథని ప్రజాస్వామ్య పోరాటం కార్యక్రమంలో చీకటి పాలనకు చరమగీతం పలికిన రోజే తన జన్మదిన జరుపుకుంటున్న సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మంథని పట్టణంలోని రాజగృహాలో తమ అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పుట్ట మధూకర్ శైలజ దంపతులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించగా అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన వేడుకల్లో వారు పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.అలాగే మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం జన్మదిన వేడుకల్లో ఏర్పాటు చేసిన సభలో భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తనకు తల్లి తల్లిదండ్రులు ఉన్నారని, జన్మదినం కూడా ఉందని, కానీ జన్మదినం చేసుకునే స్థోమత లేకనో అది తెలువకనో ఎప్పుడు చేసుకోలేదన్నారు. తానుతల్లిదండ్రులను చూడకపోయినా అక్కాచెల్లెలు, అన్నలు తనను ఆశీర్వదించి సేవ చేసే అవకాశం ఇచ్చిన రోజునే తన జన్మదినం జరుపుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈనాడు ప్రజాస్వామ్యం, ఓటు ప్రాముఖ్యత, గొప్పతనం సమాజానికి తెలియజేయాలనే అడుగు ముందుకు వేశానని తెలిపారు. తల్లిని చూడలేదు తండ్రి ఆలనాపాలన తెలియదు సమాజంలోనే పెరిగి ఈ సమాజమే నా కుటుంబం అని బావించి ముందుకు నడిస్తే మంథనిలో ఎవరికి దక్కని అనేక అవకాశాలు కల్పించారని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును ఇచ్చి గొప్పవాళ్లుగా ఎదుగాలని సంకల్పించిన అంబేద్కర్ అర్థం కాకపోవడం చదువుకుంటెనే సమాజంలో గౌరవం అంటే తెలుస్తదని తన బార్యను ఒప్పించి పిల్లలు కనకుండా దేశంలోని పిల్లలను తమ పిల్లలుగా బావించి మన కోసం త్యాగం చేసిన మహాత్యా జ్యోతిరావు పూలే తెలియకపోవడం బాధాకరమన్నారు. అయితే ఈనాడు మనం ఎందుకు ఓటు వేస్తున్నమో ఎందుకు ఉపయోగించుకుంటున్నమో అర్థం కాకనే బీసీలు ఎస్సీలు ఎస్టీలే ఆకలితో అలమటించడానికి, అణగారిన వర్గానికి కారణం మన ఓటును మనం సక్రమంగా వినియోగించుకోకపోవడమేనని ఆయన అన్నారు. రుద్రారం ప్రజలు కాంగ్రెస్ పార్టీని ప్రస్తుత ఎమ్మెల్యేను ప్రేమిస్తున్నరే కానీ అటు నుంచి ప్రేమలేదని గ్రహించాలన్నారు. తాను 2009లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తే 268 ఓట్లు మైనస్ ఇచ్చారని, మళ్లీ 2014లో 30ఓట్లు ఎక్కువ వేశారన్నారు. కేవలం 30ఓట్ల మెజార్టీ ఇస్తే రుద్రారంలో పది కోట్ల అభివృద్ధి చేశామని ఆయన గుర్తు చేశారు. సబ్‌స్టేషన్‌లు, రోడ్లు అనేకం చేశామన్నారు. కానీ మళ్లీ 2018లో 398మైనస్ చేసిండ్లని అయినా మీ పై ప్రేమ తగ్గలేదని, రుద్రారం వాసుల చిరకాల కోరికైన పాత రుద్రారం శంకరంపల్లి రోడ్డును పూర్తి చేశామన్నారు. కాంగ్రెస్ నాయకులకు బానిసత్వం తప్ప ప్రజాస్వామ్యం తెలువదని గమనించాలని, వాళ్ల జీవితాలు అంతేనని అన్నారు. రుద్రారం గ్రామప్రజలు ఎమ్మెల్యేకు గొప్ప అవకాశం ఇచ్చిండ్లని, 513ఓట్ల మెజార్టీ ఇస్తే ఇక్కడ తట్టెడు మట్టి పోయలేదన్నారు. మంథని ఎమ్మెల్యే చేతిలో గొప్ప అవకాశం ఉన్నా మన భవిష్యత్‌ను మార్చే అధికారం ఉన్నా గ్రామ రూపురేకలు మార్చే అవకాశం ఉన్నా ఇటు కన్నెత్తి చూడటం లేదన్నారు. మనం ఓట్లు వేసి గెలిపిస్తే వాళ్లు అభివృద్ధి చెందుతున్నారని, తన తమ్ముడికి పెద్ద పదవి ఇచ్చిండని, వెనుక ముందు పోలీస్ వాహనాలతో వెళ్తుండన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఇల్లు, పెన్షన్ ఇచ్చినమని చెప్తున్నరని అన్నారు. మా పిల్లలకు ఉద్యోగం ఇప్పిస్తే చాలు ఇల్లు పెన్షన్ వద్దని చెప్పేలా చైతన్యం ఎప్పుడు వస్తుందో అప్పుడు స్వాతంత్ర్యం వచ్చినట్లు అని అన్నారు. రుద్రారం గ్రామంలో బీటెక్ చదువుకున్న వాళ్లు 28, డిగ్రీ 105 బీఈడీ 3 పీజీ ఎంసీఏ 09 ఐటీఐ 03 ఉన్నారని, ఒక్కరికైనా ఉద్యోగం కల్పించిందా అని చర్చించాలన్నారు. ఎప్పటి వరకు చర్చ జరుగదో అప్పటి వరకు మనల్ని ఓటు వేసే యంత్రాలుగానే చూస్తారని అన్నారు. ఒక్క ఉద్యోగం వస్తే ఆ కుటుంబం గొప్పగా బతుకతదని, ఆ ఊరు బాగుపడుతుందన్నారు. రుద్రారం రొంపికుంట, అడవిశ్రీరాంపూర్ గ్రామాల్లో సైతం ఇలాంటి పరిస్థతులే ఉన్నాయని, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ సొంత ఊరు ధన్వాడలో సైతం ఒక్కరికి ఉద్యోగం పెట్టించలేని దుస్థితి వాళ్లదని ఎద్దేవా చేశారు. రొంపికుంటలో ఐటీఐ బీటెక్ చేసిన వాళ్లు 66 మంది డిగ్రీ చదివిన వాళ్లు 179 ఎంబీఏ పీజీ చేసిన వాళ్లు 06 ఇంటర్ చదివిన వాళ్లు 35 ఐటీఐ చేసిన వాళ్లు 12 మంది ఉన్నారని, ఇక్కడ కూడా ఒక్కరికి ఉద్యోగం పెట్టియ్యలేదన్నారు. అలాగే అడవిశ్రీరాంపూర్‌లో బీటెక్ 18 డిగ్రీ 43 ఇంటర్ 20 పీజీ 09మంది ఉన్నరని, ఒక్కరికి ఉద్యోగం లేదని, ఉద్యోగాలు పెట్టిస్తే డబ్బులు సంపాదిస్తే ఓటు విలువ తెలుస్తదని వాళ్లకు అర్థమై మనకు ఉద్యోగాలు కల్పించడం లేదన్నారు. ఎప్పుడు ఓట్లు వస్తే అప్పుడు కాటారం మండల ప్రజలు వేలలో మెజార్టీ ఇస్తున్నా వాళ్లు ఇక్కడి ప్రజల గురించి ఆలోచన చేయడం లేదని గమనించాలన్నారు. ఆనాడు తమకు అవకాశం ఇస్తే సమాజం బాగు కోసం అనేక కార్యక్రమాలు చేశామని, మహదేవ్‌పూర్ ఆస్పత్రిని బాగు చేసి డెలివరీలు జరిగేలా చర్యలు తీసుకున్నామని, పేద ప్రజల వైద్య అవసరాల కోసం అంబులెన్స్‌లు పెట్టించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ, మంథని ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఏమీ చేయకున్నా ప్రజల గురించి ఆలోచన చేయకున్నా వన్‌సైడ్ ఓట్లు వేస్తున్నారని ఆయన వాపోయారు. ఓటు మాత్రమే మన తలరాత మారుస్తదని, నాయకుడిగా ఎమ్మెల్యే మాత్రమే మన జీవితాలను బాగుపరుస్తడని గ్రహించాలన్నారు. రుద్రారంలో ఇంకా అనేక రోడ్లు కావాల్సి ఉందని, రెండేళ్లు అయినా మంథని ఎమ్మెల్యే పట్టించుకుంటలేదని, చిన్నకాళేశ్వరం గురించి మాట్లాడిన ఎమ్మెల్యే ఈనాడు దాని ఊసే ఎత్తుత లేడన్నారు. నియోజకవర్గ ప్రజలను మోసం చేసి ఐదు సార్లు ఎలా గెలిచిండో కాంగ్రెస్ పార్టీ గమనించి రాష్ట్రప్రజలనుకూడా మోసం చేయాలని చిత్రగుప్తుడిగా మానీఫెస్టో కమిటి చైర్మన్‌గా మంథని ఎమ్మెల్యేకు అవకాశం ఇస్తే 420హమీలు, ఆరు గ్యారెంటీలు రాసిండని, కానీ ఇప్పటి వరకు ఒక్కటి అమలు చేయకపోయినా ఒకటి రెండు మాత్రమే మిగిలిపోయాయని గొప్పలు చెప్పుకుంటాండ్లని ఆయన విమర్శించారు.వెయ్యి కోట్లు తీసుకువచ్చినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారే కానీ వంద కోట్ల పనులు కాలేదన్నారు. మంత్రి పదవిలో ఉండి దేవరాంపల్లి, గంగారం, శంకరాం పల్లి వద్ద రోడ్డు పని పూర్తి చేయకుండా తానే ఆపానని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మూడు ఓట్లు ఉన్న కుటుంబానికి నలబై సంవత్సరాలుగా ఓట్లు వేస్తే 40మందికి ఉద్యోగాలు రాలేదని,

30నెలలో తమ్ముడికి రాష్ట్ర కార్యదర్శి వచ్చిందని, అన్నయ్యకు రెండు మంత్రి పదవులువచ్చాయని, 4 నుంచి 5 వేల కోట్లు సంపాదించుకున్నారే కానీ ఈ ప్రాంత అభివృద్ధిగురించి ఆలోచన చేయలేదన్నారు. రుద్రారం ప్రజలు ఇన్నిసార్లు ఓట్లు వేస్తే మీ భవిష్యత్ కోసం ఆలోచన చేయలేదని కానీ మాతోటైనా మీ భవిష్యత్ మారతుందని ఆశపడుతున్నామని ఆయన అన్నారు. అధికారంలో ఉంటే అన్నం పెట్టి చదువులు చెప్పించామని, అధికారంలో లేకపోతే హైదరాబాద్‌కు మకాం మార్చకుండా ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజల కోసం పోరాటం చేస్తున్నామని అన్నారు. ప్రజల కోసం ప్రభుత్వ మెడలు వంచడానికి పోరాటం చేస్తే మా మీద కేసులు పెడుతున్నరని అన్నారు. అయినా ఎక్కడకు వెళ్లినా దీవెనలు దొరుకుతున్నాయని, మళ్లీ కేసీఆర్ రావాలని ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటాండ్లని చెప్పారు. కాటారం మండలం...రుద్రారం నుంచే మార్పు మొదలు కావాలని యువత కోరుకున్నట్లుగానే జరుగాలన్నారు. ఈనాడు కాంగ్రెస్ బీజేపీ పార్టీలు ములాఖత్ అయి పనిచేస్తన్నయని, బడేబాయి చోటేబాయ్ తరహాలో ఉన్నారని, మోడీ సీఎంను తనతో కలిసి కలిపి పని చేయమంటున్నరంటే ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్‌కు ధీటైన పార్టీ బీఆర్ఎస్ పార్టీనే అని, ప్రజల కోసం పని చేసే పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో చీకటి పాలనకు చరమగీత పాడి వెలుగులు నిండే రోజులు వస్తాయని ఆనాడు ప్రజా జన్మదిన వేడుకలను జరుపుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# పెట్రోల్ వినియోగంలో గోవా టాప్...

**హైదరాబాద్,** అంతర్జాతీయి చమురు సంక్షోభం నేపథ్యంలో ఇంధన ధరల పెరుగుతున్నాయి. పీపీఏసీ 2024-25 డేటాను పరిశీలిస్తే మన దేశంలో ప్రతి 100 మందికి రోజుకు సగటున 10.4 లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతోంది. గతేడాది లీటర్లుగా ఉండేది. కార్ల సంఖ్య పెరగడంతో వినయోగం పెరిగింది. అయితే రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం ఆర్థిక అసమానతలు ఉన్నాయి.పెట్రోల్ వినియోగంలో గోవా మొదటి స్థనంలో ఉంది. ఇక్కడ సగటున వారానికి ఒకరు 52 లీటర్ల పెట్రోల్ వినియోగిస్తాడు. ఇక్కడ 70 శాతం ఇంధన డిమాండ్ ఉంది.తర్వాత మరో మూడు రాష్ట్రాలు వరుసగా పుదుచ్చేరి, చండీగఢ్ 41 లీటర్లు, లద్దాక్ 37 లీటర్లు, అరుణాచల్ ప్రదేశ్ 27 లీటర్లు ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్ (21 లీటర్లు వినియోగిస్తుంది. తెలంగాణ 17 లీటర్లతక్ష 10వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 11లీటర్ల వినియోగంతో 22వ రాష్ట్రంగా నిలిచింది.చిన్న రాష్ట్రాల్లో టూరిజం, ప్రైవేట్ వెహికల్స్ (పెట్రోల్ కార్లు 80 శాతం) వల్ల వినియోగం ఎక్కువ. తెలంగాణఆంధ్రల్లో మిక్స్‌డ్ ఎకానమీ (2?వీలర్లు 70 శాత, పబ్లిక్ ట్రాన్స్ 20 శాతం) మధ్యస్థ స్థాయి. బిహార్ వంటివి గ్రామీణ ప్రాంతాలు, సైకిల్/బైక్ ఆధారిత రవాణా (పెట్రోల్ కార్లు 5 శాతం)తో తక్కువ. మొత్తం దేశ వినియోగం 3.5 కోట్ల లీటర్లు. ఆర్థిక, పర్యావరణ, పాలసీ ఒత్తిడి.. భారీగా పెట్రోలియం వినియోగంతో రూ.1.5 లక్షల కోట్ల చెల్లించాల్సి వస్తోంది.కాలుష్యం తగ్గించేందుకు పెట్రోల్‌లో 25 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. హైకన్సూయమ్ రాష్ట్రాల్లో ఎయిర్ పొల్యూషన్ 30 శాతం ఎక్కువ. ధనిక రాష్ట్రాల్లో కార్ కల్చర్, పబ్లిక్ ట్రాన్స్ ఆధారం ఇది రీజనల్ డివైడ్‌ను పెంచుతోంది.ఒక వ్యక్తి సగటున వారానికి 10.4 లీటర్లు ఒక హెచ్చరికే. ఇంధన భద్రత, పర్యావరణ లక్ష్యాల దృష్ట్యా వినియోగం తగ్గించాలి. ప్రాంతీయ సమతుల్యతకు డ్రైవర్. ప్రభుత్వాలు రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగితే మనదేశం ఎనర్జీ?స్మార్ట్ నేషన్‌గా మారుతుంది.

# పవన్‌కు ఇన్ని ఆరోగ్య సమస్యలా

**గుంటూరు,** సైనస్ ఆపరేషన్ కారణంగా గత కొంత కాలం నుండి విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ , నేడు తొలిసారి మీడియా ముందుకు వచ్చాడు. జనసేన పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న ఆయన , నేడు మాట్లాడిన కొన్ని మాటలు ఇప్పుడు సోషల్ మీడియా అంతటా బాగా వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఉద్యమి సభ్యత్వాలను అత్యధిక శాతం చేయించిన కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించాడు. ఇదంతా పక్కన పెడితే , తన ఆరోగ్య పరిస్థితి పై పవన్ కళ్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానులను కాస్త ఆందోళనకు గురి చేస్తోంది. ఇన్ని సమస్యలను పెట్టుకొని ఒక పక్క సినిమాలు , మరోపక్క రాజకీయాలు ఎలా మ్యానేజ్ చేస్తున్నావ్ అన్నా అని ఆయన అభిమానులు సోషల్ మీడియా లో కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ పవన్ కళ్యాణ్ ఏమి మాట్లాడాడో ఒకసారి చూద్దాం.ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతానికి నా ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఎన్నికల సమయం లో బాగా తిరగడం తో పాటు , నాకు కరోనా వచ్చినప్పుడు ఏర్పడిన లంగ్ ఇన్ఫెక్షన్ అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత దుమ్ము , ధూళి లో తిరగడం వల్ల , సైనస్ ప్రాంతాల్లో ఆ డస్ట్ బాగా గట్టి పడింది, అది కాలక్రమేణా వాచిపోయేలా చేసింది. ఆ కారణం చేత ఒక రోజు నా కళ్ళు కనిపించకుండా పోయింది. ఈ కారణాల చేత భీమవరం లో ఒక ప్రోగ్రాం ఉన్నప్పటికీ క్యాన్సిల్ చేసి , హైదరాబాద్ కి వెళ్లి , ఇవన్నీ సరిచేసుకొని రావడానికి ఒక నెల రోజుల సమయం పట్టింది. డాక్టర్లు నా రెండు భుజాల మధ్య కూడా టెర్ వచ్చేసిందని అన్నారు. ఎందుకు ఇలా వచ్చింది అని డాక్టర్లు అడగ్గా, క్యాంపైన్ కి వెళ్ళినప్పుడు అభిమానులు చేతులు పట్టుకొని లాగేస్తుంటారు , కన్దతెగిపోయేంత లాగేస్తారు' అంటూ చెప్పుకొచ్చాడు. ఆయన మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియో ని మీకోసం క్రింద అందిస్తున్నాము చూడండి. ప్రస్తుతానికి పవన్ కళ్యాణ్ కి ఎలాంటి ఆరోగ్య సమస్య లేదు అనేది స్పష్టమైంది , రాబోయే రోజుల్లో ఆయన సినిమాలను , రాజకీయాలను ఎలా బ్యాలన్స్ చేస్తాడో చూడాలి.

# గ్రేటర్‌పై ధరల భారం..

**హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరల పెంపుదల తెలంగాణ బీజేపీకి ఇబ్బందికరంగా మారనుంది. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఈసారి 300 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికల్లో నలభైకి పైగా స్థానాలను గెలుచుకుంది. కానీ ఈసారి ఆ పరిస్థితి ఉండే అవకాశం లేదు. అయితే ఈ సమయంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. లీటర్ పెట్రోలు, డీజిల్ పై 3.04 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ లో పెట్రోలు లీటర్ పెట్రోలు ధర 110.88, లీటరు డీజిల్ ధర 98.96 రూపాయలకు చేరుకుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఇది భారమనే చెప్పాలి.ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పెట్రోలు, డీజిల్ ధరల భారం పెనుమార్పులు తేనుంది. నిత్యావసరాల ధరలు పెరగడమే కాకుండా కూరగాయల ధరలు కూడా పెరిగే అవకాశముంది. దాదాపు అన్ని ధరలు పెరగనున్నాయి. బియ్యం నుంచి ఉప్పు వరకూ అన్ని ధరలు పెరిగితే అది సామాన్యుడి అసహనానికి కారణమవుతుంది. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఎన్ని పొదుపు సూత్రాలు, మంత్రాలు చెప్పినా ప్రజలకు తమ జేబుల్లో నుంచి డబ్బులు పోతే మాత్రం ఊరికే ఉండరు. తమ అసంతృప్తిని ఓటు రూపంలో ఖచ్చితంగా వెళ్లగక్కుతారన్న ఆందోళన కమలం పార్టీ నేతల్లో కనిపిస్తుంది.ఈ ధరలు పెరుగుదలతో బీజేపీ విజయానికి అడ్డుకట్ట వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. అర్ధరాత్రి ..నెల మధ్యలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్ ధర కూడా ఇటీవల అరవై రూపాయలు పెరగడంతో ఆ ప్రభావం తమ పార్టీపై పడుతుందేమోనన్న భయం బీజేపీ నేతలకు పట్టుకుంది. సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీన పెట్రో ఉత్పత్తుల ధరలను సమీక్ష చేసే చమురు సంస్థలు నెల మధ్యలోనే నిర్ణయం తీసుకుని జనంపై వీర బాదుడు చేశాయి.

అదేమంటే గత నాలుగేళ్ల నుంచి ధరలను పెంచలేదంటూ కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంటున్నప్పటికీ, పశ్చిమాసియా యుద్ధం ప్రభావం కారణంగా క్రూడాయిల్ ధరలు పెరిగడంతో చమురు సంస్థలు నష్టాల్లో పడ్డాయని అందుకే ధరలను పెంచకతప్పదని గత కొన్ని రోజులుగా లీకులిస్తున్నాయి. ప్రధాని మోదీ తో సహా పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలంటూ పొదుపు మంత్రం పఠించారు.తాజాగా లీటరు పెట్రోలుపై మూడు రూపాయలు, లీటరు డీజిల్ పై మూడు రూపాయలు అదనంగా వడ్డించి ప్రజల నడ్డి విరిచింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు లీటరు పెట్రోలుపై రెండు రూపాయలు తగ్గించి ఓట్లు పొందిన కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసిన తర్వాత మూడు రూపాయలు అదనపు భారం వేసింది. దీని వల్ల నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగనున్నాయి. ప్రజల కొనుగోలు శక్తిపై కూడా ప్రభావం పడుతుంది. ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు పై 3.29 రూపాయలు, డీజిల్ పై లీటరకు 3.14 రూపాయలు పెంచాయి. తెలంగాణాలో పెట్రోలు, డీజిల్ లీటర్ పై మూడు రూపాయలు పెంచాయి.మెట్రో నగరం కావడంతో ఎక్కువ మంది పెరిగిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఓటెత్తే అవకాశముందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం బీజేపీ ఆశలకు గండి కొట్టినట్లయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# టీటీడీపికి తాళం...

**హైదరాబాద్ :** తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పూర్తిగా క్లోజ్ చేసినట్లే కనపడుతుంది. మహానాడు వంటి కార్యక్రమాల్లో మాత్రమే తెలంగాణ టీడీపీ నేతలు కనపడుతున్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అనధికారికంగా మూత వేసినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరోసారి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి మళ్లీ రావడం టీడీపీ నాయకత్వం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. 2024లో గెలిచిన తొలినాళ్లలో చంద్రబాబు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చి టీటీడీపీ నేతలతో సమావేశమై ఇక్కడ పార్టీని బలోపేతం చేస్తామని ప్రకటించారు. కానీ తర్వాత మాత్రం ఆ దిశగా ఎటువంటి చర్యలుచేపట్టలేదు. మహానాడులో మాత్రం తెలంగాణ టీడీపీ నేతలు కనిపించి వెళ్లిపోతున్నారు.మరొకవైపు తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి నియామకం కూడా చేపట్టలేదు. అసలు కార్యవర్గాన్నే నియమించలేదు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉండటంతో పాటు తెలుగుదేశం పార్టీపై ఆంధ్ర పార్టీగా ముద్ర పడింది. ఇప్పటికే వైసీపీ అధినేత జగన్ తెలంగాణలో వైసీపీని మూసివేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. కానీ తెలుగుదేశం పార్టీ మాత్రం జాతీయ పార్టీ గా ఉండలని భావించి తెలంగాణలో వరసగా అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తుంది. 2014, 2018 ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసి తక్కువ స్థానాల్లో విజయం సాధించింది. అయినా గెలిచిన వారు ఎవరూ పార్టీలో ఉండలేదు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఎన్నికలకు వెళ్లింది.2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ తెలంగాణను పూర్తిగా వదిలేసినట్లే కనపడుతుంది. చంద్రబాబు హైదరాబాద్ కు వారం వారం వస్తున్నప్పటికీ టీటీడీపీ నేతలతో సమావేశం అయ్యేందుకు సుముఖంగా కనిపించడం లేదు. అందులో ఆంధ్రప్రదేశ్ లో బీజేపీలో టీడీపీ కూటమిగా ఉండటం, తెలంగాణలో మాత్రం బీజేపీ టీడీపీతో పొత్తుకు అంగీకరించకపోవడంతో ఇక్కడ సైకిల్ పార్టీని పూర్తిగా గాలికి వదిలేసింది. ఉన్న కొద్దోగొప్పో ఓటు బ్యాంకు ఇతర పార్టీలకు తరలి వెళ్లాయి. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేసే అవకాశం లేదు. దీంతో టీడీపీ తెలంగాణ శాఖ దాదాపుగా మూసివేసినట్లేనన్న సంకేతాలను పార్టీ నాయకత్వం ఇచ్చిందనే చెప్పాలి.

# తిరుపతి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యలు పరిష్కరించండి

## - నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయండి
## - కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యల పరిష్కారం, అలాగే డిజిటల్ విద్యా మరియు సైబర్ పరిశోధన రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి, రేణిగుంట, గూడూరు ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే సమస్యలు పరిష్కరించాలని కోరారు.రేణిగుంట రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రధాన టెర్మినల్‌గా అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ కోరారు. ప్రయాణికుల కోసం మెరుగైన వసతులు, పార్కింగ్, కార్గో సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. శ్రీకాళహస్తి, నడికుడి రైల్వే లైన్ తుది దశ పనులను వేగవంతం చేయాలని కోరారు.సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు నుంచి తిరుపతి వరకు పొడిగించాలని, దీని ద్వారా నెల్లూరు జిల్లా ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగం ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గూడూరులోని అంబేద్కర్ నగర్ అండర్‌పాస్ విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని, వెందోడు రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, పూరి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపేజీలు కల్పించాలని కోరారు. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని కూడా వివరించారు.డిజిటల్ విద్య, సైబర్ భద్రత రంగాల్లో తిరుపతిని జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడంలో నైలెట్ కీలక పాత్ర పోషిస్తుందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ప్రతిపాదిత భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు, హాస్టళ్లు, ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటు కోసం కనీసం రూ.300 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పాలసీ, లా అండ్ టెక్నికల్ రీసెర్చ్ ఇన్ సైబర్ స్పేస్" ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందించాలని కోరారు. తిరుపతికి సైబర్ పరిశోధన మరియు డిజిటల్ ఆవిష్కరణల ప్రధాన కేంద్రంగా ఎదిగే సామర్థ్యం ఉందని, కేంద్రం సానుకూలంగా స్పందిస్తే ప్రాంతీయ అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు.

# వైభవోపేతంగా శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

## - బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర
## - ఆధ్యాత్మిక శోభ కనిపించేలా ఏర్పాట్లుమే 27న గరుడ సేవ - మే 30న రథోత్సవం

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా, మరింత ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్వహించనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టిటిడి జేఈవో లు శ్రీ వి వీరబ్రహ్మం, డా. ఎ.శరత్, సివిఎస్వో శ్రీ కే వి మురళీకృష్ణ లతో కలిసి టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శనివారం ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ నివాస గృహంలోని ఈవో ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ వైభవాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో విశేష ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళ కళలాడేలా చలువ పందిళ్లు, ఆకర్షణీయమైన విద్యుత్ అలంకరణలు, రంగురంగుల ముగ్గులు, పుష్పాలంకరణలు, వైట్ పెయింటింగ్, సాంప్రదాయ చిత్రకళా అలంకరణలు, ఎల్ఈడీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.మే 22న సాయంత్రం 5.30 గంటల నుండి 8 గంటల వరకు అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మే 23న ఉదయం 7.35 గంటల నుండి 8.49 గంటల వరకు మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు.

ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు నిర్వహించనున్న వాహనసేవలు భక్తి పారవశ్యాన్ని పంచనున్నాయి. ముఖ్యంగా మే 27న గరుడవాహన సేవ, మే 30న రథోత్సవం బ్రహ్మోత్సవాలకు ఆకర్షణగా నిలవనున్నాయి.వాహనసేవల విశేషాలు24.05.2026 ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం25.05.2026 ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం26.05.2026 ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం27.05.2026 ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం28.05.2026 ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం29.05.2026 ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం30.05.2026 ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం31.05.2026 ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంబ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్. శాంతి, ఏఈవో శ్రీ ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అర్చకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు

# సైబరాబాద్‌లో కొత్త తరహా సైబర్ నేరం

**హైదరాబాద్** సైబరాబాద్ లో సరికొత్త తరహ సైబర్ నేరం బయటపడింది. ఈ సిమ్ ను ఫిజికల్ సిమ్ గా మార్చాలనీ బ్యాంక్ అధికారుల పేరుతో బాధితుడికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసారు. ఈ సిమ్ ను చేంజ్ చేసి జనరల్ సిమ్ గా మార్చి తాము పంపిన ఫోన్ లో వేయండి అని నమ్మించారు. మోటోరాల ఫోన్ ను బాధితుడికి పంపి ముందుగానే కొన్ని యాప్ లను పెట్టారు. తరువాత బాధితుడి ఖాతాలో ఉన్న 77 లక్షలు రూపాయలు కాజేసారు సైబర్ నేరగాళ్లు.సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ వెస్ట్ బెంగాల్ లో ఒక చెట్టు కింద కూర్చుని ఈ తరహా సైబర్ నేరానికి సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారు. అచ్చం జాంతార తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు.ఈ నేరంలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసారు. 15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల పాటు వెస్ట్ బెంగాల్, ఢిల్లీ లో ఆపరేషన్ నిర్వహించినట్లు డీసీపీ వెల్లడించారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో

# అందరూ భాగస్వాములు అవ్వాలి

## - ఇంచార్జి కమిషనర్ శారదా దేవి




**తిరుపతి** ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్లాస్టిక్ నివారణపై పాత మునిసిపల్ కార్యాలయం నుండి శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో కమిషనర్ తో పాటు గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టిటిడి బోర్డు మెంబెర్ భానుప్రకాష్ రెడ్డి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం తదితరులు పాల్గొని ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర భాగంగా ప్రతి మూడవ శనివారం ఒక థీమ్ తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 'ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్' అనే థీమ్ తో ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, పూర్తిగా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యమని తెలిపారు. తిరుపతిని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వలన అనేక అనర్తాలు కలుగుతున్నాయని వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని తెలిపారు. ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు వంటి పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాదవ్, డి.ఈ లు రాజు, వెంకట ప్రసాద్, అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్వచ్చంధ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం




**బ్రహ్మంగారిమఠం** మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని ప్రాథమిక వైద్యశాల నుంచి డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మెడికల్ ఆఫీసర్ సంపత్ కుమార్ తో పాటు హెల్త్ అసిస్టెంట్లు మాధవ,వెంకటరెడ్డి,ల్యాబ్ టెక్నీషియన్ రమణ కుమార్,స్టాఫ్ నర్స్ లలితమ్మ,ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్లు జోత్స్న,విజయ లక్ష్మి అలాగే ఆశా వర్కర్లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

## - కరీంనగర్ సిపి గౌష్ ఆలం







**కరీంనగర్** రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం నాడు కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో విశ్వ హిందూ పరిషద్ బజరంగ్ దళ్,గోరక్ష ప్రముఖ్ తదితర హిందూ మత సంఘాల ప్రతినిధులతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.పండుగ వేళ ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణా లేదా గోవధకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా,తక్షణమే పోలీసులకు తెలియజేయాలే తప్ప చట్టాన్ని ఉల్లంఘించ కూడదని హెచ్చరించారు. అలా కాదని చట్టాన్ని అతిక్రమిస్తే,తెలంగాణ గోవధ నిషేధ మరియు జంతు సంరక్షణ చట్టం,1977 ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు.వ్యూహాత్మక ప్రాంతాలలో 6 చెక్‌పోస్టులుపశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 121 చెక్‌పోస్టులు,52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని..కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా 6 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు.

## రోడ్ నిర్మాణ పనులు పరిశీలించిన

# కలెక్టర్ కె. హైమావతి



**హుస్నాబాద్** హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు 77.20కోట్లతో నాలుగు వరసల రోడ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రోడ్ వెంబడి చెట్లు కటింగ్, పొదల తొలగింపు ప్రక్రియ దాదాపు పూర్తి అయిందని ఎలక్ట్రిక్ స్తంభాల షిఫ్టింగ్ పనులు సైతం వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్ జాయింట్ పర్యవేక్షణ చేసి మున్సిపల్ ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న చెట్లు కటింగ్,మార్నింగ్ చేసిన వరకు నివాసాలను తొలగించే ప్రక్రియ పూర్తి చెయ్యాలని ఆదేశించారు. రోడ్ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలోపు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్ లక్ష్మా రెడ్డి, విద్యుత్ శాఖ డిఈ, తదితరులు ఉన్నారు.

# టీడీపీ కొత్త ప్రచారం

**ఒంగోలు,** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరిశీలించిన తర్వాత ఏపీలో అనేక మార్పులు వస్తాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత ప్రభుత్వాల పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకు మాత్రమే తమిళనాడు అసెంబ్లీలో చోటు దక్కింది. కానీ ఏపీ విషయానికి వచ్చేసరికి గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను జగన్ వచ్చిన తర్వాత 2019 -24 మధ్య రద్దు చేశారు. వీటిలో ప్రధానంగా అన్నా క్యాంటీన్, షాదీ ముబారక్ వంటి కీలక పథకాలు ఉన్నాయి. అదే విధంగా ఉన్నత విద్యను అభ్యసించే వారికి విదేశాలకు వెళ్లే సదుపాయాన్ని కూడా దాదాపు తీసేశారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. అదే సమయంలో టిడిపికి అనుకూల ఓటు బ్యాంకు ను పెంచాయి. దీనిని గమనించిన చంద్రబాబు వైసీపీ అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అలాగే వాటిని కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు అమ్మబడి పేరుతో వైసిపి హయంలో అమలు చేసిన పథకాన్ని తల్లికి వందనం పేరుతో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారుఅదే విధంగా రైతు భరోసా పేరుతో వైసిపి అమలు చేసిన పథకాన్ని అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేస్తున్నారు. అదే సమయంలో అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వీటిని మరింత పెంచాలని కూడా భావిస్తున్నారు. వీటికి తోడు విదేశీ రుణాలు, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పునరుద్ధరించారు. ఇక ఇప్పుడు వైసీపీ పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. టిడిపి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తారా అంటే తమ విధానాలు తమకు ఉన్నాయని ఇటీవల బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి టిడిపి అమలు చేస్తున్న పథకాలు వైసీపీ వస్తే తీసేసే ప్రమాదం ఉందన్నది స్పష్టమవుతుంది. ఇది ఎన్నికల సమయంలో స్పష్టంగా ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామాలు సృష్టించడం ఖాయం అవుతుంది. వీటిని టార్గెట్గా చేసుకుని టిడిపి ఇప్పుడు ప్రచారం చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే పూర్తిగా రద్దు చేస్తుందని ప్రధానంగా మహిళలకు ఉచితంగా అమల్లోచేస్తున్న బస్సు ప్రయాణాలు రద్దవుతాయని చెప్పనుంది. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను కూడా రద్దు చేస్తారని ప్రచారం చేయాలని టిడిపి నిర్ణయించింది. తద్వారా వైసిపిని అడ్డుకునేందుకు సాధ్యమైనన్ని వ్యూహాలను అమలు చేయాలని టిడిపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. మహానాడు వేదికగా దీనికి సంబంధించి ప్రకటన చేయనున్నారు. ఎలా చూసుకున్నప్పటికీ ప్రజల్లో విస్తృతంగా ఉన్న కొన్ని పథకాల విషయంలో వైసిపి మారకపోతే కష్టం అనే భావన వినిపిస్తోంది.

### పెమ్మసాని ప్లాన్ తో గుంటూరు...

గుంటూరు నగర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా మరో అడుగు పడింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టాభిపురం రైతు బజార్ నూతన హైటెక్ భవన నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిలతో కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ఈ మార్కెట్‌ను కార్పొరేట్ స్థాయి వసతులతో ఆధునీకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును చేపట్టారు. వినియోగదారులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు రూ. 6 కోట్ల భారీ వ్యయంతో, సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నూతన రైతు బజార్‌ను నిర్మించనున్నారు. అత్యంత ఆధునిక సాంకేతికతతో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తుల భవనంగా ఇది రూపుదిద్దుకోనుంది. ఎండ, వానల నుండి రక్షణ కల్పిస్తూ పూర్తి హైజీనిక్ వాతావరణంలో కూరగాయలు కొనుగోలు చేసేలా ఈ ప్లాన్ డిజైన్ చేశారు. ఈ నూతన మల్టీ-లెవెల్ భవనంలో మొత్తం 100 అత్యాధునిక షాపులను ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక సమతుల్యతను పాటిస్తూ ఈ షాపుల కేటాయింపులో స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. 60 షాపులను, నేరుగా గ్రామాల నుండి వచ్చే అసలైన రైతులకు కేటాయిస్తారు. 30 షాపులను స్వయం సహాయక బృందాలకు చెందిన డ్వాక్రా ( మహిళా వ్యాపారులకు కేటాయిస్తారు. మిగిలిన షాపులను ఇతర నిత్యావసర వస్తువుల విక్రయదారులకు కేటాయించనున్నారు. కేవలం షాపులే కాకుండా, కస్టమర్ల సౌకర్యార్థం ఈ భవనంలో అధునిక పార్కింగ్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు, అత్యాధునిక టాయిలెట్స్ మరియు హైజీన్ వసతులను కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ భవన నిర్మాణం ఇన్నాళ్లూ జాప్యం అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రైతులకు, వినియోగదారులకు ఒకే చోట మేలు చేయడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేవలం 9 నెలల రికార్డు కాలంలోనే ఈ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

# అమరావతికి యుద్ధ గండం

**విజయవాడ,** ఆంధ్రప్రదేశ్ ప్రజల ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కుతున్న తరుణంలో ఊహించని గ్లోబల్ సవాళ్లు ఎదురవుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు , పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు అమరావతి నిర్మాణాల కొనసాగింపును మరోసారి ప్రశ్నార్థకం చేస్తున్నాయి. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సప్లై చెయిన్ దెబ్బతినడం, చమురు ధరలు పెరగడం వంటి కారణాలతో కేంద్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టులపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో అమరావతి వంటి మెగా ప్రాజెక్టుల పురోగతిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, భారీ నిర్మాణ పనులను కనీసం రెండేళ్ల పాటు వాయిదా వేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రకటించిన ఆస్టెరిటీ పాలసీలో భాగంగా ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తుండటం అమరావతికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ ప్రచారాన్ని నీతి ఆయోగ్ తోసిపుచ్చినప్పటికీ, ఏపీలోని ప్రతిపక్షాలు దీనిని రాజకీయ అస్త్రంగా మార్చుకుంటున్నాయి. అమరావతి ఆగిపోతుందని అంటున్నారు. దీంతో రాజధాని నిర్మాణం మళ్లీ అటకెక్కుతుందా అనే ఆందోళన సామాన్య ప్రజల్లో నెలకొంది. అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల్లో సింహభాగం ప్రపంచ బ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రావాల్సి ఉంది. యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లు అస్థిరంగా మారితే, ఈ రుణాల మంజూరులో జాప్యం జరిగే ప్రమాదం ఉంది. గ్లోబల్ ఎకానమీ కుదేలైతే బ్యాంకులు తమ ప్రాధాన్యతలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఇప్పుడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద తలనొప్పిగా మారింది. రాజకీయంగా చూస్తే, అమరావతిని తన ప్రతిష్టగా భావిస్తున్న చంద్రబాబుకు ఇది ఒక అగ్నిపరీక్ష. ఒకవైపు రాష్ట్రంలో ఆర్థిక వనరుల కొరత, మరోవైపు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం .. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం ఇప్పుడు ఆయన ముందున్న సవాల్. గతంలో పారిశ్రామికీకరణను పరుగులు పెట్టించిన అనుభవం ఉన్నప్పటికీ, ఇప్పుడు యుద్ధం వంటి బాహ్య శక్తుల ప్రభావం వల్ల ప్రాజెక్టు మందగిస్తే లక్ష్యం చేరుకోవడం ఆలస్యం అవుతుంది.

అమరావతి చుట్టూ జరుగుతున్న రాజకీయం ఈ అనుమానాలను మరింత బలపరుస్తోంది. రాజధాని పనులు వాయిదా పడతాయనే ప్రచారం ద్వారా ఇన్వెస్టర్లలో భయాందోళనలు సృష్టించేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిర్మాణ పనులు జోరుగా సాగుతున్ నసమయంలో ఇలాంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి వాయిదా నిర్ణయాన్ని ప్రకటించలేదని కూటమి నేతలు గట్టిగా చెబుతున్నారు. నీతి ఆయోగ్ వివరణ కూడా ప్రభుత్వానికి కొంత ఊరటనిస్తోంది. కానీ, ప్రపంచ యుద్ధ మేఘాలు తొలగిపోనంత కాలం అమరావతి వంటి భారీ ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటూనే ఉంటాయన్నది సత్యం. ఏపీ రాజధాని కల నెరవేరాలంటే కేవలం రాష్ట్ర సంకల్పం మాత్రమే కాదు, అంతర్జాతీయ పరిస్థితులు కూడా అనుకూలించాల్సిన అవసరం కనిపిస్తోంది.

## స్ట్రాటజిస్టులు కాదు.. అస్ట్రాలజిస్ట్స్

**విజయవాడ,** రాజకీయాల్లో గెలుపు గుర్రం ఎక్కేందుకు వ్యూహకర్తలు ఇచ్చే డేటా కంటే, గ్రహగతులు మార్చే జ్యోతిష్యుల పైనే రాజకీయ నేతలు ఎక్కువ నమ్మకం పెంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల తమిళనాడులో విజయ్ విజయం వెనుక జ్యోతిష్యుడి హస్తం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండటంతో, ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా అదే బాట పట్టారు. చండీగఢ్‌కు చెందిన ప్రముఖ ఆస్ట్రాలజర్ రుద్ర కరణ్ ప్రతాప్ ప్రత్యేకంగా తాడేపల్లికి వచ్చి జగన్‌తో భేటీ కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల్లో ఐప్యాక్ వంటి వ్యూహకర్తలను నమ్ముకున్న జగన్, ఈసారి మాత్రం గ్రహబలంపైనే భారం వేసినట్లు కనిపిస్తోంది. చండీగఢ్ నుంచి రుద్ర కరణ్ ప్రతాప్‌ను ప్రత్యేకంగా తాడేపల్లికి రప్పించడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని వైసీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా జ్యోతిష్యం చెప్పడంలో రుద్ర కరణ్ సిద్ధహస్తుడని పేరుంది. తన పర్యటనకు సంబంధించిన వివరాలను సదరు జ్యోతిష్యుడు సోషల్ మీడియాలో స్వయంగా పంచుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిజానికి, 2024 ఎన్నికల్లో జగన్ ఘనవిజయం సాధిస్తారని రుద్ర కరణ్ ప్రతాప్ గతంలోనే జోస్యం చెప్పారు. అయితే ఆ అంచనాలు క్షేత్రస్థాయిలో తలకిందులయ్యాయి. అయినప్పటికీ, జగన్ ఆయనపై నమ్మకం కోల్పోకుండా మళ్ళీ పిలిపించి చర్చలు జరపడం గమనార్హం. కేవలం రాజకీయ భవిష్యత్తే కాకుండా, ప్రస్తుతం ఎదుర్కొంటున్న న్యాయపరమైన చిక్కులు, వ్యక్తిగత జాతక దోషాల నివారణ కోసం కూడా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. స్ట్రాటజిస్టులు ఇచ్చే లెక్కలు ఒక్కోసారి తప్పవచ్చు కానీ, సరైన జ్యోతిష్యుడి సాయంతో గ్రహాలను అనుకూలం చేసుకోవచ్చని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. తమిళనాడులో విజయ్ పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారంలోకి రావడానికి ఆయన వ్యక్తిగత జ్యోతిష్యుడు ఇచ్చిన సలహాలే కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విజయ్ ఫార్ములా ను చూశాక, జగన్ కూడా పొలిటికల్ స్ట్రాటజిస్టుల కంటే ఆస్ట్రాలజిస్టులే బెటర్ అనే ముగింపుకు వచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే తాడేపల్లి ప్యాలెస్‌లో ఇప్పుడు పొలిటికల్ డేటా కంటే, జాతక చక్రాలు, గ్రహాల సంచారంపైనే ఎక్కువ చర్చలు జరుగుతున్నాయి. జ్యోతిష్యుడి సలహాలు జగన్ జాతకాన్ని ఎంతవరకు మారుస్తాయో వేచి చూడాలి.

# భారీ మెజార్టీపై నేతలు కన్ను

**విశాఖపట్టణం** టిడిపిలోనే కొందరు నాయకులకు మెజారిటీ సమస్య ఇప్పుడు కొంత గడబిడగా మారింది. గత ఎన్నికల సమయంలో భారీ స్థాయి మెజారిటీతో విజయం దక్కించుకున్న చాలామంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉదాహరణకు గాజువాక నియోజకవర్గంలో టిడిపి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఊహించని మెజారిటీని సాధించారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ కూడా 90 వేల పైచిలుకు మెజారిటీని దక్కించుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది నాయకులు భారీ మెజారిటీని సొంతం చేసుకున్నారుఅయితే ఆ సమయంలో కూటమి ప్రభావంతో పాటు వైసిపి వ్యతిరేకత తీవ్ర స్థాయిలో కనిపించింది. దీనివల్లే వీరికి అనూహ్యమైన మెజారిటీ దక్కిందన్న వాదన ఉంది. వచ్చే ఎన్నికల నాటికి ఇదే ప్రభావం కనిపిస్తుందా.. లేకపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మారుతుందా.. అనేది ఇప్పుడు కొంతమంది నాయకులలో చర్చనీయాంశంగా మారింది. దీంతో తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఏఏ మండలాల్లో తమకు ఎక్కువగా ఓట్లు పడ్డాయి.. ఏ ఏ సామాజిక వర్గాల నుంచి తమకు ఓట్లు భారీ సంఖ్యలో పడ్డాయి.. అనే విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. తద్వారా ఆయా మండలాలు, ఆయా సామాజిక వర్గాలను మరింత మంచి చేసుకుని వచ్చే ఎన్నికల సమయానికి తమకు మెజారిటీ పెంచుకోవడంతో పాటు ఒకవేళ పెరిగినా పెరగకపోయినా తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గంలో పల్లా శ్రీనివాసరావు ఇటీవల పర్యటనలు చేస్తున్నారు. తన సామాజిక వర్గం నాయకులతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కూడా మమేకమవుతున్నారు. మెజారిటీ తగ్గకుండా చూడాలని ఆయన పదేపదే చెబుతున్నారు. గెలుపు అనేది ఖాయమే అయినప్పటికీ మెజారిటీ ఇప్పుడు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. ఇక మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ కూడా ఇదే ప్రయత్నాలు చేస్తున్నారు. తనను ఎవరు కలిసినా మెజారిటీపైనే దృష్టి పెట్టాలని ఆయన చెబుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాలే కాదు రాష్ట్రవ్యాప్తంగా భారీ మెజారిటీ దక్కించుకున్న నాయకులంతా ఇదే పనిపై దృష్టి పెట్టడం విశేషం. మరి వీరు అనుకున్నట్టుగా మెజారిటీ కొనసాగుతుందా లేకపోతే తగ్గుతుందా అనేది చూడాలి. ప్రస్తుతానికైతే మెజారిటీ తగ్గకుండా చూసుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికిగాను సంక్షేమ పథకాల అమలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

## ఉప్పరపల్లి రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

**తిరుపతి** తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చడమే ధ్యేయంగా తుడా ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ఉప్పరపల్లి పరిధిలో జరుగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన తుడా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్న ఆయన, కాంట్రాక్టర్‌కు మరియు ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉప్పరపల్లి రోడ్డు అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం కాబట్టి, పనుల వల్ల స్థానిక ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బారికేడ్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉప్పరపల్లి రోడ్డు విస్తరణ ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అని, పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు, ఇంజనీరింగ్ అధికారులు, మరియు కాంట్రాక్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు

# దువ్వాడ లెక్క ఏంటీ

**శ్రీకాకుళం,** పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా కొందరు నాయకులు రాజకీయాల్లో వేసే వేషాలు.. అంతగా సక్సెస్ కావన్నది అందరికీ తెలిసిందే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు పరిస్థితి కూడా ఇలానే ఉంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోతే.. స్వతంత్రంగానే పోటీ చేస్తానని.. గెలిచి తీరుతానని చెబుతున్నారు. నిజానికి ఇలాంటి ప్రకటనలు చేయడం చాలా తేలిక. కానీ.. నిరూపించుకోవడం, సాధించడం మాత్రం అంత తేలికకాదు. ఒకప్పుడు ఒంటరిగా పోరాటం చేసేందుకు నాయకులు పెద్దగా వెనుకాడాల్సిన అవసరం ఉండేది కాదు.

కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బలమైన పార్టీల హవా.. ప్రభుత్వాల దూకుడు వంటివి ఎక్కువగా పనిచేస్తున్నాయి. అంతేకాదు, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను.. వారి గ్రాఫ్‌నుకూడా ప్రజలు తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చిన తర్వాత అభ్యర్థుల వ్యవహార శైలి కూడా పెద్ద ఎత్తున చర్చకు వస్తోంది. ఇది వ్యక్తిగత అంశాల వరకు కూడా ప్రభావితం అవుతోంది. దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత ఇమేజ్ ఇబ్బందుల్లో ఉందనే చెప్పాలి. కుటుంబాన్ని ఆయన దూరం పెట్టి.. సహజీవనం చేస్తున్న వైనం.. సొంత అనుచరుల మధ్యే చర్చకు వస్తోంది. ఇక, నియోజకవర్గం రాజకీయంగా ఇది వివాదం అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. దువ్వాడకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్ కూడా పెద్దగా కనిపించడం లేదు. నియోజకవర్గంలో ప్రజలకు ఏమైనా సేవ చేసి ఉంటే.. దానిని చెప్పుకొనేందుకు అవకాశం ఉండేది. కానీ, అలాంటిదేమీ లేదు ఇటు వైపు చూసుకుంటే టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి ముందు దువ్వాడ తేలిపోతున్నారు. రాజకీయ పరంగా చూసుకున్నా.. వ్యక్తిగతంగా చూసుకున్నా.. రామ్మోహన్ ముందు దువ్వాడ ఎక్కడా సమ ఉజ్జీ కాదన్న వాదన ఉంది. గతంలో ఎప్పుడోపోటీ చేసినప్పుడు భారీ ఓట్లు వచ్చాయని అనుకున్నా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో దువ్వాడ చిందులు పెద్ద ఎత్తున ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒంటరి పోరు.. దువ్వాడకు చేదు అనుభవమే అవుతుందని అంటున్నారు.

# పెట్రోల్ భారం....

## రోజువారీ వస్తువులపై ప్రభావం

**హైదరాబాద్** పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో వాహనదారులపై భారం పడింది. లీటరు పెట్రోల్‌పై రూ.3.14, డీజిల్‌పై రూ.3.11 చొప్పున పెంచుతూ చమురు కంపెనీలు తీసుకున్న అమల్లోకి వచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో రాకపోకలకు అంతరాయం, ఖర్చులు పెరగడం ఈ పెంపునకు ప్రధాన కారణంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు గత 11 వారాలుగా ఇంధన ధరలను పెంచకుండా స్థిరంగా కొనసాగించాయి. అయితే, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోలేక చివరకు సామాన్యులపై ఈ భారాన్ని మోపక తప్పలేదని కంపెనీలు పేర్కొన్నాయి. గత కొంతకాలంగా ఏ పెరుగుదల గురించి అయితే ఆందోళన వ్యక్తం చేస్తున్నారో అదే జరిగింది. వాస్తవానికి 2022 ఏప్రిల్ నుంచి ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేవు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మాత్రం లీటరుకు రూ.2 చొప్పున కేంద్రం తగ్గించింది. ఇటీవల అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా దేశంలో పెట్రో ధరలు పెరుగుతాయని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే దేశంలో సరిపడా నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పట్లో భరోసా ఇచ్చింది. ప్రభుత్వం ఆ ప్రకటనలు చేసిన కొద్ది రోజులకే ఇప్పుడు ధరలు పెరిగాయి. ఈ తాజా పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపి, పలు రంగాలపై ప్రభావం చూపుతుందని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. ఇంధన ధరలు పెరగడం వల్ల ప్రభావం కేవలం వాహనాలకే పరిమితం కాదు. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, పాలు, రేషన్, ఆన్‌లైన్ డెలివరీ, బస్సు, ఆటో ఛార్జీలు, రోజువారీ అవసరమైన అనేక వస్తువుల ధరలు పెరుగుతాయి. ఖర్చులు పెరగడంతో రాబోయే రోజుల్లో ఇంటి బడ్జెట్ మరింత పెరిగి సామాన్యుడు ఇబ్బంది పడతాడు. కొన్ని రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలకు లిమిట్ విధించి విక్రయాలు జరుపుగుతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో మొదట రోజువారీ ఉపయోగించే వస్తువులపై ప్రభావం కనిపిస్తుంది. పండ్లు, కూరగాయలను పొలాల నుండి మార్కెట్లకు చేరవేయడానికి రవాణా ఖర్చు పెరుగుతుంది. దీనివల్ల వాటి ధరలు పెరుగుతాయి. పాలు, ఇతర డైరీ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పెట్రోల్-డీజిల్ ధరలు వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేయవచ్చు. ఇంధన ధరలు పెరగడం వల్ల ట్రావెలింగ్ ఖర్చులు పెరుగుతాయి. ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో పాటు సరుకు రవాణా ఖర్చులు పెరుగుతాయి. దాంతో అది పలు రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడు కంపెనీలు ఛార్జీలను పెంచుతాయి. దీంతో పాటు స్కూల్ బస్సు, ఆటోలు సైతం రేట్లు పెంచుతాయి. పిల్లల ట్రాన్స్‌పోర్ట్ ఫీజులు తల్లిదండ్రులకు మరింత భారం కానున్నాయి. తాజా నిర్ణయం కారణంగా ఉబర్, ఓలా, ర్యాపిడో బుకింగ్ ధరలు అమాంతం పెంచే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల ఆన్‌లైన్ సేవలపై కూడా పడవచ్చు. అమెజాన్ , ఫ్లిప్‌కార్ట్, జొమాటో, స్విగ్గీ వంటి కంపెనీలు డెలివరీ ఛార్జీలను పెంచుతాయి. లగేజీ, పార్సిల్స్ పంపే కొరియర్ సేవల ధరలు పెరిగే అవకాశం ఉంది.

# తిరుమలలో గంటకు 10 వేల మంది దర్శనం



**తిరుమల,** కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం ఇప్పుడు సులభతరంగా మారింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు చేపట్టిన సరికొత్త చర్యల వల్ల వేలాది మంది భక్తులకు ఇప్పుడు కేవలం గంటల వ్యవధిలోనే స్వామి వారి దర్శన భాగ్యం కలుగుతోంది. వెరసి గతంలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలవాల్సిన పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. అదే సమయంలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు విడిది సౌకర్యం లభ్యత కూడా బాగా పెరిగింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వ్యవస్థ దోహదం చేస్తోందని చెప్పాలి. ఈ నెల 2న తిరుమల వెంకన్నను 91 వేల మంది దాకా దర్శనం చేసుకున్నారు. వీరందరికీ కేవలం 12 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సత్తా చాటింది. తాజాగా బుధవారం 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా వారికి కేవలం 8 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సరికొత్త రికార్డు నమోదు చేసింది. అంటే. గంటకు 10 వేల మంది చొప్పున స్వామి వారిని దర్శించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టింది. గతంలో ఇదే 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోవాలంటే 18 నుంచి 24 గంటల సమయం పట్టేది. ఇప్పుడు ఐసీసీసీ వల్ల కేవలం ఓ గంటలోనే 10 వేల మందికి స్వామి వారి దర్శనం లభిస్తోంది. కేవలం అతి స్వల్ప వ్యవధిలోనే స్వామి వారి దర్శనం లభిస్తున్న నేపథ్యంలో తిరుమలలో విడిది గదులను బుక్ చేసుకుంటున్న భక్తులు.. దర్శనం వెంటనే వాటిని ఖాళీ చేస్తున్నారు. ఫలితంగా తిరుమల కొండపై విడిది గదుల కొరత అన్న సమస్యల ఉత్పన్నం కావడం లేదు. స్వామి వారి దర్శనం కోసం వస్తున్న దాదాపు అందరు భక్తులకూ విడిది గదులు లభిస్తున్నాయని చెప్పాలి. గతంలో అయితే గదుల కోసం భక్తులు సుదీర్ఘ కాలం పాటు వేచి చూడాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు త్వరితగతిన దర్శనాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో గదుల లభ్యత కూడా బాగా పెరిగింది.

## మే చివరి నాటికే నైరుతి రుతుపవనాల ఎంట్రీ

**హైదరాబాద్,** తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఐదు రోజులు ముందుగానే.. అంటే మే 26 నాటికే కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ప్రకటించింది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇది మే 22 నుంచి 30 మధ్య మారవచ్చునని పేర్కొంది. ఈ లెక్కన తెలంగాణను జూన్ 1 లేదా 2వ తేదీల్లో రుతుపవనాలు పలకరించనున్నాయి. అయితే ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షపాతం సాధారణం కంటే కొంచెం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ విభాగం ఎట్టకేలకు చల్లని కబురు చెప్పింది. దేశ వ్యవసాయ రంగానికి వెన్నెముక లాంటి నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందే దేశంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు.. ఈసారి ఐదు రోజులు ముందుగానే అంటే మే 26 నాటికే కేరళను తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. వాతావరణంలో వస్తున్న మార్పుల ఆధారంగా మే 22 నుంచి మే 30 మధ్య కాలంలో ఎప్పుడైనా ఇవి కేరళ తీరాన్ని తాకవచ్చని స్పష్టం చేసింది. తెలంగాణకు సైతం రుతుపవనాల రాక ముందస్తుగానే ఉండబోతోంది. సాధారణంగా కేరళ తీరాన్ని తాకిన ఐదు రోజుల తర్వాత రుతుపవనాలు రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లోకి ప్రవేశిస్తాయి. గతేడాది వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే.. మే 24న కేరళను తాకిన రుతుపవనాలు మే 31 నాటికి తెలంగాణను పలకరించాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ 1 లేదా రెండో తేదీ నాటికే తెలంగాణవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ముందస్తు రుతుపవనాల రాకతో తీవ్రమైన ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు, సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు పెద్ద ఊరట లభించినట్లయింది. అయితే, వర్షపాతం విషయంలో వాతావరణ శాఖ ఒక కీలక హెచ్చరికను కూడా జారీ చేసింది. ఈ ఏడాది రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే కొంచెం తక్కువగా వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ అభిప్రాయపడింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో పరిస్థితులే దీనికి ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా ఈ వర్షాకాలంలో సగటున 80 సెంటీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉండగా.. 1971-2020 మధ్య కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు 87 సెంటీమీటర్లుగా ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ముందస్తు రుతుపవనాల రాక సాగు పనులకు సానుకూలంగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరింది. శుక్రవారం పగటిపూట అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలో 44.5 డిగ్రీల సెల్సియస్ రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అయితే, ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో శనివారం ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# టిప్పర్ ఢీ కొని నలుగురు మృతి

**కాకినాడ** కాకినాడ రూరల్ కొవ్వూరు బ్రిడ్జి దగ్గర ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలను టిప్పర్ లారీ ఢీ కొట్టింది. ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి కి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం కాకినాడ జిజిహెచ్ కి తరలించారు. ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్తూ రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది.

# కావూరు వద్ద పొగాకు లారీ బోల్తా

## – తప్పిన పెను ప్రమాదం



**చిలకలూరిపేట:** ప్రకాశం జిల్లా టంగుటూరు నుండి పొగాకు లోడుతో నరసరావుపేట వెళ్తున్న ఒక లారీ, చిలకలూరిపేట మండలం కావూరు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అదృష్టవశాత్తూ లారీలోని వారికి కానీ, ఇతర ప్రయాణికులకు కానీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# వృద్ధ దంపతులపై అమానవీయ చర్య

**విజయనగరం** వృద్ధ దంపతులని అధికారులు ప్రొక్లెయినర్ బకెట్లో కూర్చోబెట్టి భయభ్రాంతులకు గురిచేసారు. విజయనగరం జిల్లాలో భోగాపురం మండలం బైరెడ్డిపాలెంలో దారుణ ఘటన. భోగాపురం ఎయిర్పోర్ట్ అప్రోచ్ రోడ్డు కోసం సేకరించిన భూముల స్వాధీనానికి రెవెన్యూ అధికారులు అమానవీయ చర్యలకు పాల్పడ్డారు. పరిహారం చెల్లించకుండా భూముల స్వాధీనం చేయరాదంటూ రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రైతులను బయపెట్టెందుకు ఈ చర్యకు దిగారు.

## విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి

# వైద్యుడిపై రేప్ కేసు

**విజయవాడ** ప్రభుత్వ ఆసుపత్రి లో పనచేస్తున్న డాక్టర్ పై రేప్, అట్రాసిటీ కేసు నమోదయింది. నిందితుడు తనకు పెళ్లైన విషయం దాచి నర్సును రెండో వివాహం చేసుకొని నాలుగేళ్లు కాపురం చేసాడు. మొదటి భార్యకు రెండో వివాహ వ్యవహారం తెలిసింది. దాంతో డాక్టర్ అప్పటి నుంచి రెండో భార్య దగ్గరకు వెళ్లడంలేదు. డాక్టర్ను రెండో భార్య నిలదీసింది. అప్పుడు మొదటి వివాహ విషయం బయటపడింది. పిల్లలు అప్పుడే వద్దంటూ రెండో భార్యకు నిందితుడు రెండుసార్లు అబార్షన్ చేయించాడు. పెళ్లయిన విషయం దాచి మోసం చేశాడంటూ మహిళా పోలీస్ స్టేషన్ లో రెండో భార్య పిర్యాదు చేసింది. ఎన్టీఆర్ జిల్లా మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. రేప్ కేసుతో పాటు అట్రాసిటీ కేసు సైతం నమోదు చేసారు.

## వైకాపా మహిళా నేతపై

# కూటిమి నేతల బూతు పురాణం

**తిరుపతి** తిరుపతిలో మహిళపై కూటమి నేతల బూతుల దండకం వివాదానికి దారి తీసింది. వైసీపీ తిరుపతి ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మిని బూతులు తిడుతూ టీడీపీ నేత జేబీ శ్రీనివాస్ అనుచరుడు మాచర్ల రఘురాం పోస్ట్ కామెంట్ పెట్టాడు. దానికి నిరసనగా తిరుపతి గాంధీ విగ్రహం ముందు వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆందోళన చేసారు. నిరసన చేస్తున్న వారిపై కూటమి నేతలు దాడికి ప్రయత్నించారు. పోలీసులు నిరసనకారులను పోలీసు స్టేషన్ కు తరలించారు.

# కోదాడలో "బడిబాట"




**కోదాడ :** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం "బడిబాట" (ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట) కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినులు కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి వసతులను వివరించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, బడి వయసు పిల్లలు ఎవరూ బయట ఉండకుండా చూడాలని కోరారు. టాపర్లకు అభినందనల జల్లు: ఇదే వేదికపై, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటిన విద్యార్థినులు కట్టికోల పూజశ్రీ మరియు మాలవతు పవిత్రలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థినులు ఘనంగా అభినందించారు. వారి ప్రతిభ మిగిలిన విద్యార్థినులకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కూడా కార్పొరేట్ సంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఈ విద్యార్థినులు నిరూపించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి వ్యూహం.. తెల్లవారుజామున మెరుపు దాడి!

## – అన్నమయ్య జిల్లాలో పోలీసుల 'ఆపరేషన్ వజ్రప్రహార్'..



**మదనపల్లి,** శాంతిభద్రతల పరిరక్షణే శ్వాసగా, ప్రజల సురక్షిత జీవనమే పరమావధిగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ శనివారం తెల్లవారుజామున అత్యంత పకడ్బందీగా రెండు భారీ నిఘా ఆపరేషన్‌లను నిర్వహించింది. జిల్లాను నేరరహితంగా మార్చుడానికి, సమాజానికి ముప్పుగా పరిణమిస్తున్న శక్తుల ఆటకట్టించడానికి "ఆపరేషన్ వజ్రప్రహార్" నిర్వహించారు. ఈ వ్యూహాత్మక చర్య శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత, జిల్లా అంతా ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో అత్యంత నిశ్శబ్దంగా మొదలైంది. మదనపల్లె, రాయచోటి సబ్ డివిజన్లలోని సమస్యాత్మక ప్రాంతాలే లక్ష్యంగా పోలీసులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. సరిగ్గా సమయం ఉదయం 4:00 గంటలు.. కోడికూత కూడా వినబడని ఆ కారుచీకట్లో ప్రజల రక్షణ కోసం పోలీస్ బలగాలు అడుగులు వేశాయి. మదనపల్లె డీఎస్పీ శ్రీమతి బి. పావని గారి నేతృత్వంలో 105 మంది, రాయచోటి డీఎస్పీ శ్రీ ఎం.ఆర్. కృష్ణమోహన్ గారి నేతృత్వంలో 61 మంది.. మొత్తం 166 మంది నిబద్ధత గల పోలీస్ అధికారులు, సిబ్బంది ఏకకాలంలో రంగంలోకి దిగారు. ఎవరికీ ఎటువంటి ముందస్తు సమాచారం లీక్ కాకుండా, అత్యంత రహస్యంగా మదనపల్లె తాలూకా పరిధిలోని కోళ్లబైలు జగన్ కాలనీ, కలకడ మండలం బంగారువాండ్లపల్లి గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. నిశ్శబ్దంగా సాగిన ఈ మెరుపు తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది వీధుల్లో సోదాలు నిర్వహిస్తుండగా, భూతలం నుండి ఎవరూ తప్పించుకోకుండా నిఘాను మరింత పటిష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామాలపై గగనతలం నుంచి పర్యవేక్షణ చేపట్టారు. గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని నిశితంగా పరిశీలిస్తూ అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేలా నిఘా కొనసాగించారు. ఈ అధునాతన నిఘా వ్యవస్థతో గ్రామాల్లోని ప్రతి సందు, పొదలు మరియు నిర్మానుష్య ప్రాంతాలను కంట్రోల్ రూమ్ స్క్రీన్లపై నిరంతరం పర్యవేక్షించారు. పోలీసులు పన్నిన ఈ రక్షణ వలయంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా సాగాయి. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తూ, నెంబర్ ప్లేట్లు మార్చి, సరైన రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆయా ప్రాంతాలలో అనుమానాస్పదంగా ఉన్న మొత్తం 133 వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. పక్కా ఆధారాలు లేని 78 వాహనాలను స్పాట్‌లోనే స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో 71 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 కార్లు మరియు ఒక ట్రాక్టర్ ఉన్నాయి. చట్టపరమైన పూర్తి పత్రాలు సమర్పించిన తర్వాతే ఈ వాహనాలను విడుదల చేయడం జరుగుతుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అయితే పోలీస్ శాఖ అంటే కేవలం తనిఖీలు, కేసులు మాత్రమే కాదు.. ప్రజలతో మమేకమయ్యే రక్షకులు అని నిరూపిస్తూ, తనిఖీల అనంతరం మదనపల్లెలో 300 మంది, కలకడలో 210 మంది ప్రజలను ఒకచోటకు చేర్చి ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. స్థానిక శాంతిభద్రతల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. "మీ ప్రాంతాల రక్షణే మా బాధ్యత. ఊర్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, లేదా ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించండి" అని స్థానికుల్లో ధైర్యాన్ని నింపారు. అనంతరం సమాజ శ్రేయస్సు కోసం, నేరాల నిర్మూలన కోసం ప్రజలందరితో కలిసి పోలీసులు, ఈగల్ టీమ్ సిబ్బంది "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" చేయించారు. ప్రజలు, పోలీసులు కలిసికట్టుగా నిలబడిన ఆ క్షణం ఈ ఆపరేషన్‌కే మకుటాయమానంగా నిలిచింది. యువత భవిష్యత్తును పాడు చేస్తూ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల (గంజాయి, డ్రగ్స్) మూలాలను వేరుతో సహా తొలగించడమేనని. ఈ సందర్భంగా డిఎస్పీ లు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై జిల్లాలో గంజాయి రవాణా చేసినా, విక్రయించినా పాత నేరస్థులైనా, కొత్త వారైనా సరే.. పీడీ యాక్ట్, పి.ఐ.టి, ఎన్‌డీపీఎస్ చట్టాల కింద అత్యంత కఠినమైన జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

## హోటల్లో అగ్ని ప్రమాదం..

# తప్పిన ప్రాణ నష్టం

**సికింద్రాబాద్..** రెజిమెంటల్ బజార్ మెట్రో పాలిస్ హోటల్ లో తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంబంధించినది. ఈ హోటల్లోని మూడవ అంతస్తులో ఉన్న వంట గదిలో నుండి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న రెస్టారెంట్ కు వ్యాపించడంతో అగ్ని ప్రమాద తీవ్రత పెరిగింది. మంటల తీవ్రత వేడి కారణంగా, వంటగదిని ఆనుకుని ఉన్న భోజనశాల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలు మిగిలిన అంతస్తులకు భవనంలోని ప్రక్క భాగాలకు వ్యాపించకుండా నివారించారు. ఈ హోటల్లో బస చేస్తున్న 67 మంది ఈ అగ్ని ప్రమాద ఘటనకు భయాందోళనకు గురికాగా వారిని హైడ్రాలిక్ ప్లాట్ఫామ్ వెహికల్ బ్రాంటో స్కైలిఫ్ట్ ద్వారా సురక్షితంగా కాపాడినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యుతఘాధం మూలంగానే అగ్నిప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు.

## కోదాడ గణపవరం గ్రామంలో

# హత్య కలకలం



**కోదాడ** గణపవరం గ్రామంలో గణేష్ చదువు రీత్యా బెంగళూరులో ఉంటూ చదువైన తర్వాత బెంగళూరులో జాబ్ చేస్తూ న్నాడు. సెలవులు నిమిత్తం తన గ్రామానికి వచ్చి మూడు రోజులు అయితుండగా తన స్నేహితుడు మ్యారేజ్ ఫంక్షన్ కి రాత్రి 8 గంటల సమయంలో వెళ్లి మరల తన స్నేహితులతో కలిసి కనిపించాడు. తరువాత కనిపించకుండా పోయాడు. గణేష్ కనిపించకపోవడంతో బంధువులు పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. గణేష్ మృతదేహం లక్ష్యం పురం గ్రామం రోడ్డుకి మామిడి తోటలో ఉందని రైతు చూసి గ్రామస్తులకు తెలియజేశాడు. గణేష్ ఒంటిపైన కత్తి పోట్లు, మెడపైన కత్తి తోటి పొడిచి ఒంటి మీద ఉన్న బట్టలన్నీ తీసేసి అతి కిరాతకంగా చంపినట్లు పోలీసులు గుర్తించారు.

# బ్లాక్ స్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**కర్నూలు** పంచలింగాల టోల్గేట్ వద్ద బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సు ను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. తరువాత పంచలింగాల టోల్గేట్ వద్ద బ్లాక్ స్పాట్ ను పరిశీలిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీస్ అధికారులకు, హైవే అధికారులకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేసారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సులో బయలుదేరి బ్లాక్ స్పాట్ ను పరిశీలిస్తూ, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

# సౌత్‌పై జనసేన ఫోకస్...

జనసేన పార్టీ

**గుంటూరు,** జనసేనాని పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడులకు విస్తరించే పనిలో పడ్డారు. ఇప్పటికే కేరళకు చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు, కర్ణాటక నుంచి మాజీ ఎమ్మెల్యేలు జనసేన తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ నేషనల్ ఇమేజ్ ను పెంచింది. ఎన్డీయే కూటమిలో కీలక నేతగా ఎదిగిన పవన్, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి గొంతుకగా మారాలని భావిస్తున్నారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ వేగంగా జరుగుతున్నా, సొంత గడ్డ ఏపీలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఆయన అడుగులు చాలా నెమ్మదిగా పడుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా జనసేనలో ఇప్పటికీ పూర్తిస్థాయి జిల్లా, మండల కమిటీల నియామకం జరగకపోవడం క్యాడర్‌ను కొంత అసహనానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బిజీగా ఉండటం ఒక కారణమైతే, అర్హులైన వారికే పదవులు దక్కాలనే పట్టుదల మరొక కారణం. అయితే, క్షేత్రస్థాయిలో కమిటీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, టీడీపీ-బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవడంలోనూ జనసైనికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జాప్యం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. జనసేన బలోపేతానికి మరో పెద్ద అడ్డంకి.. పార్టీలోకి కొత్తగా వచ్చి చేరుతున్న వారితో పాటు సోషల్ మీడియా వేదికగా హడావుడి చేస్తున్న కొందరు కార్యకర్తలు. అధికారంలోకి వచ్చాక యాక్టివ్ అయిన వారు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. పదవులు రాకపోతే కూటమి ప్రభుత్వంపై, సొంత నాయకత్వంపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ధోరణిని పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. అందుకే, అడ్వాంటేజ్ కోసం వచ్చే వారిని కాకుండా, పదేళ్ల పాటు పార్టీని నమ్ముకున్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న ఆయన.. బాధ్యతల అప్పగింతలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. టీడీపీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న తరుణంలో, ఎక్కడ ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి పునాదులకే దెబ్బ తగులుతుందని పవన్ భావిస్తున్నారు. అందుకే పార్టీ పరంగా దూకుడు తగ్గించి, పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టారు. అయితే, ఇదే సమయంలో టీడీపీ తన గ్రామ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకుంటుంటే, జనసేన వెనుకబడిపోతోందనే ఆందోళన పార్టీ కార్యకర్తల్లో ఉంది. ముఖ్యంగా నియోజకవర్గాల ఇన్-ఛార్జుల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం వల్ల కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం వల్ల జాతీయ స్థాయిలో జనసేనకు లభించే గుర్తింపు, భవిష్యత్తులో ఏపీలో పార్టీ ఎదుగుదలకు ప్లస్ అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయం ఇప్పుడు ఎక్కువ మంది చేరడం నిబద్ధత కలిగిన నేతలు వైపు మళ్లింది. ఈ క్రమంలో జరిగే జాప్యం క్యాడర్‌కు ఇబ్బందిగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని జనసేన అగ్ర నాయకత్వం వాదిస్తోంది. జనసేన పూర్తిస్థాయి కమిటీలతో సరికొత్త రూపం సంతరించుకుంటుందో లేదో వేచి చూడాలి.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు

**రేణిగుంట** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు లభించే నాణ్యమైన విద్య మరియు వసతులను సద్వినియోగం చేసుకోవాలని రేణిగుంట మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రంగయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని వెదుళ్ల చెరువు మరియు ఎస్టీసీ కాలనీ పరిసర ప్రాంతాల్లో "బడి పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా భారీ 'ఎన్రోల్మెంట్ డ్రైవ్' నిర్వహించారు.?ఇంటింటికీ వెళ్లి అవగాహన?ఈ సందర్భంగా ఎంఈఓ రంగయ్య ఉపాధ్యాయ బృందంతో కలిసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేడు కార్పొరేట్ స్థాయికి దీటుగా వసతులు కల్పిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధిస్తున్న ఉత్తమ మార్కులు మరియు ర్యాంకుల గురించి తల్లిదండ్రులకు వివరించి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.?విద్యార్థులకు దుస్తుల పంపిణీ?కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల పట్ల దాతృత్వాన్ని చాటుకుంటూ దివాకర్ అనే వ్యక్తి విద్యార్థులకు ఉచితంగా బట్టలు పంపిణీ చేశారు. ఈ వితరణను ఎంఈఓ మరియు ఉపాధ్యాయులు అభినందించారు.?ఈ కార్యక్రమంలో గుత్తివారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, మల్లవరం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వెంకటరమణ, వెదుళ్ల చెరువు ఎస్టీసీ మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం మేఘనాథ్, సిఆర్ఎంటి మునయ్య, పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు మరియు విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# విజయ్ చాలా సరదాగా ఉంటారు

## మాళవిక మోహనన్

టాలీవుడ్, కోలీవుడ్‌లలో వరుస క్రేజీ ఆఫర్లు అందుకుంటూ హీరోయిన్ మాళవిక మోహనన్ దూసుకుపోతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పై ప్రశంసల వర్షం కురిపించారు. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'మాస్టర్' సినిమా షూటింగ్ జ్ఞాపకాలను ఆమె ఈ సందర్భంగా పంచుకున్నారు. 'మాస్టర్' సినిమా మొదటి రోజు షూటింగ్‌లోనే తనకు చాలా కష్టమైన సీన్ ఎదురైందని, దానివల్ల తన ఫోకస్ మొత్తం డైలాగ్స్‌పైనే పెట్టాల్సి వచ్చిందని మాళవిక తెలిపారు. అయితే, విజయ్ మాత్రం ఎంతటి కష్టమైన సీన్ అయినా సరే.. ఎంతో ప్రశాంతంగా (కూల్‌గా), ప్రతి చిన్న విషయంపై దృష్టి పెడుతూ నటిస్తారని ఆమె కొనియాడారు. సెట్స్‌లో ఆయన అందరితో చాలా సరదాగా ఉంటారని చెప్పారు. మోహన్ లాల్, రజనీకాంత్, విజయ్ వంటి సీనియర్ మోస్ట్ సూపర్ స్టార్ల నుంచి ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నానని మాళవిక వెల్లడించారు. ముఖ్యంగా వారి టైమ్ మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఉదయం 7 గంటలకు షూటింగ్ అని చెబితే.. వారు ఉదయమే 6.55 కల్లా సెట్స్‌లో హాజరవుతారని స్పష్టం చేశారు. అంతటి పెద్ద స్టార్స్ సమయపాలన పాటించడం వల్లే ఇండస్ట్రీలో నిర్మాతలకు భారీగా డబ్బు వృథా కాకుండా ఉంటుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## నేటి యువతకు లవ్, రిలేషన్ అంటే ఏమిటో

# తెలియదు: తమన్నా



హీరోయిన్ తమన్నా భాటియా నేటితరం యువతకు ప్రేమ, బంధాల (రిలేషన్స్) పై సరికొత్త లెక్చర్లు ఇస్తూ వార్తల్లో నిలిచారు. ముఖ్యంగా నటుడు విజయ్ వర్మతో బ్రేకప్ అయినప్పటి నుంచి ఆమె సమయం దొరికినప్పుడల్లా ప్రేమకు సంబంధించిన తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకుంటున్నారు. అసలు వీరిద్దరి బంధం పెళ్లి వరకు వెళుతుందని అందరూ అనుకుంటే, ఎందుకు సడన్‌గా విడిపోయింది, తమన్నాను విజయ్ వర్మ ఏమైనా అనుమానించారా లేదా మరేదైనా కారణం ఉందా అనే విషయాలను ఇప్పటివరకు ఈ జంట అధికారికంగా బయటపెట్టనప్పటికీ, తాజాగా తమన్నా చేసిన వ్యాఖ్యలు వారి బ్రేకప్ కారణాలపై పలు అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయి. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ అనేది ఒక్కసారి మాత్రమే కాదు, పలుమార్లు పుట్టవచ్చుని మరియు అదే నిజమైన ప్రేమ అని వ్యాఖ్యానించారు. నేటితరం యువతకు లవ్, రిలేషన్ అంటే సరిగ్గా తెలియక గందరగోళానికి గురవుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తిని నిజంగా ప్రేమించాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, మన భావాలను వారిపై బలవంతంగా రుద్దడం ద్వారా ప్రేమను నిరూపించుకోలేమని స్పష్టం చేశారు. ప్రేమ అనేది కేవలం ఒకే ఒకసారి కలిగే అనుభవం కాదని, అది జీవితంలో అనేకసార్లు జరగాల్సిన ప్రేరణ అని పేర్కొంటూ, ఇది బహిరంగంగా హావభావాల ద్వారా వ్యక్తపరిచేది కాదని, అంతర్లీనంగా పుట్టే ఒక భావోద్వేగమని తమన్నా వివరించారు. ఆమె చెబుతున్న ఈ మాటలను బట్టి చూస్తే, ప్రేమ విషయంలో ఆమె వ్యక్తిగత స్వేచ్ఛకు ఎంతగా ప్రాధాన్యత ఇస్తుందో అర్థమవుతోంది.

# ప్రతి అనుభవం ఒక పాఠమే



స్త్రీ స్వేచ్ఛ అనే అంశంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది బాలీవుడ్ భామ కైరా అద్వానీ. ఈ నేపథ్యంలో ఏడాది కూడా నిండని తన కుమార్తె సరయు భవిష్యత్ గురించి మాట్లాడుతూ షాకింగ్ కామెంట్లు చేసింది. దీంతో ఆమెపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఆ ఇంటర్వ్యూలో కైరా మాట్లాడుతూ 'స్త్రీకి స్వేచ్ఛ అవసరం. కట్టుబానిసగా బతకాల్సిన అవసరం స్త్రీకి లేదు. పెళ్లయినా, డేటింగ్ అయినా ఆమె ఇష్టంతో జరగాలి. నేను అలాగే బ్రతికాను. సరైన వ్యక్తిని ఎంచుకునే క్రమంలో చాలామందితో డేటింగ్ చేశాను. చివరకు సరైన వ్యక్తి దొరికాడు. ఎదిగే క్రమంలో ప్రతి అనుభవం ఒక పాఠమే. అవే మనల్ని మనిషిగా మారుస్తాయి. పొరపాట్లు మానవసహజం. వాటిని దిద్దుకుంటూ ముందుకు సాగడమే జీవితం. నా కూతురు సరయు విషయంలోనూ నేను ఇదే పంథా అనుసరిస్తా. నాలాగే తనూ జీవిస్తుంది. ఈ క్రమంలో తనకు ఎలాంటి ఆంక్షలూ విధించను' అంటూ చెప్పుకొచ్చింది కైరా. ఇక ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. కూతురు గురించి ఇలాగేనా మాట్లాడేది? ఇదేం ఫెమినిజం? అంటూ ప్రశ్నిస్తున్నారు. కియారా మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# 'ఎగ్జామ్' సిరీస్ రివ్యూ!



ఒక వైపున హారర్ థ్రిల్లర్లు .. మరో వైపున క్రైమ్ థ్రిల్లర్లు ఓటీటీలను ఊపేస్తున్నాయి. ఇక అడపా దడపా పొలిటికల్ థ్రిల్లర్లు పలకరిస్తూ వెళుతున్నాయి. అయితే అందుకు భిన్నంగా ఒక సిరీస్ ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ కి వచ్చింది. ఆ సిరీస్ పేరే 'ఎగ్జామ్'. దుషారా విజయన్ – అదితి బాలన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ లో అబ్బాస్ కీలకమైన పాత్రలో కనిపిస్తాడు. 7 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, ఈ నెల 15వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. మరుమల్లి (అదితి బాలన్) డీఎస్పీ గా పనిచేస్తూ ఉంటుంది. తన కూతురుతో కలిసి తల్లి దగ్గర ఆమె ఉంటూ ఉంటుంది. 'తైకారా' అనే ప్రదేశానికి ఆమెకి బదిలీ అవుతుంది. జాయినింగ్ రిపోర్ట్ ను సబ్మిట్ చేయడం కోసం ఆమె ఒంటరిగా బయల్దేరుతుంది. ఫారెస్టు ప్రాంతం మీదుగా వెళుతున్న ఆమెను, ఝాన్సీ (దుషారా విజయన్) కిడ్నాప్ చేస్తుంది. జయచంద్రన్ (అబ్బాస్) సూచన మేరకు, మరుమల్లిని ఒక రహస్య ప్రదేశంలో బంధిస్తుంది. మరుమల్లి పేరుతో తాను డీఎస్పీగా ఝాన్సీ డ్యూటీలో చేరుతుంది. తాను మరుమల్లిని కాదనే విషయం బయటికి తెలిసేలోగా తాను వచ్చిన పనిని పూర్తి చేయాలని నిర్ణయించుకుంటుంది. పోటీ పరీక్షలు .. ప్రశ్న పత్రాల లీక్ చేసే వ్యవహారాలు .. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే కోట్ల రూపాయల స్కామ్ వెనుక ఎవరున్నారనేది తెలుసుకోవడానికి ధైర్యంగా ముందుకు వెళుతుంది. ఆ సమయంలోనే ఆమెకి 'కుమరేశన్' పేరు వినిపిస్తుంది. కుమరేశన్ ఎవరు? అతని నేపథ్యం ఏమిటి? పోటీ పరీక్షలకి సంబంధించిన ప్రశ్న పత్రాలను లీక్ విషయంలో అతని పాత్ర ఏమిటి? ఈ మొత్తం వ్యవహారంతో మరుమల్లికి ఉన్న సంబంధం ఎలాంటిది? ఈ విషయంలో ఝాన్సీ ఎందుకు జోక్యం చేసుకుంటోంది? ఆమెను ఇంతటి సాహసానికి పురిగొల్పిన పరిస్థితులు ఎలాంటివి? ఆమెకి సాయం చేసే జయచంద్రన్ ఎవరు? అనే ఉత్కంఠభరితమైన మలుపులతో ఈ కథ ముందుకు వెళుతుంది. చాలామందికి ప్రభుత్వ ఉద్యోగం అనేది ఒక కల. అలాంటి ఒక ప్రభుత్వ ఉద్యోగాన్ని సంపాదించుకోవడానికి వాళ్లంతా ఎంతో కష్టపడుతూ ఉంటారు. ఎలాంటి కోచింగ్ లేని పల్లెటూరి పిల్లలు .. ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమయ్యే పిల్లలు ఆ సమస్యలను దాటుకుంటూ పుస్తకాలపై దృష్టి పెట్టడం సామాన్యమైన విశేషమేం కాదు. అలాంటి పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే ఒక నెట్ వర్క్ చుట్టూ తిరిగే కథ ఇది. ఎంతోమంది తెలివైన పిల్లలు పల్లెటూళ్లకే పరిమితమైపోతున్నారు. ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ కాలం కలిసి రాకపోవడం వలన, పేదరికంలో మగ్గిపోతున్నారు. చదువుకోవాలని ఉన్నప్పటికీ, కూలి పనులను దాటుకుని అడుగుముందుకు వేయలేకపోతున్నారు. కానీ ఎలాంటి ప్రతిభలేని కొంతమంది పిల్లలు అడ్డదారుల్లో మార్కులు సంపాదిస్తున్నారు .. సర్టిఫికెట్లు సంపాదిస్తున్నారు .. ఉద్యోగాలు పొందుతున్నారు. అయితే ఈ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి పేదరికాన్ని జయించి పట్టణంలో అడుగుపెట్టిన కుమరేశన్ .. ఝాన్సీలకు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? ఆ సవాళ్లను దాటుకుంటూ వాళ్లు ఎలా తమ మార్గంలో ముందుకు వెళతారు? అనే ప్రధానమైన అంశం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. దర్శకుడు నాణానికి ఇరువైపులా అన్నట్టుగా ఒక వైపున కుమరేశన్ ను .. మరో వైపున ఝాన్సీ పాత్రలను చూపిస్తూ కథను పట్టుగా నడిపించాడు. ఈ కథ మూడు కోణాల వైపు నుంచి ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల సమాహారం ఒకటైతే, కుమరేశన్ కి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ .. ఝాన్సీ ఫ్లాష్ బ్యాక్ రెండు వైపులా నుంచి కనెక్ట్ అవుతాయి. ఈ ఇద్దరి ఫ్లాష్ బ్యాకులు ఈ కథకు మరింత బలాన్ని చేకూర్చాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఎలా లీక్ అవుతున్నాయి? అవి డబ్బున్న పిల్లల చేతికి ఎలా చేరుతున్నాయి? నిజమైన ప్రతిభ కలిగిన పేద పిల్లలు ఎలా వెనుకబడి పోతున్నారు? సర్కారీ కొలువులు డబ్బున్నవారికి ఎలా అలంకారంగా మారుతున్నాయి? ఇదే పనిగా పెట్టుకున్న నెట్ వర్క్ ఎలా పనిచేస్తుంది? అనేది దర్శకుడు చూపించిన తీరు మెప్పిస్తుంది .. ఆలోచింపజేస్తుంది

ఆందోళన

కలిగిస్తుంది.'ఎగ్జామ్' అనే టైటిల్ ఈ సిరీస్ కి కరెక్టుగా సరిపోతుంది. కాకపోతే పోటీ పరీక్షలు .. కోచింగ్ సెంటర్లు .. పేపర్ లీక్ కావడం .. అందుకు సంబంధించిన హడావిడి ఎక్కువగా ఉంటుందని అనుకోవడం సహజం.

# 'కర్తవ్య' మూవీ రివ్యూ!



సైఫ్ అలీ ఖాన్ కథానాయకుడిగా నటించిన సినిమానే 'కర్తవ్య'. గౌరీఖాన్ నిర్మించిన ఈ సినిమాకి 'పుల్కిత్' దర్శకత్వం వహించాడు. సైఫ్ అలీ ఖాన్ పోలీస్ ఆఫీసర్ గా నటించిన ఈ సినిమాను నేరుగా ఈ నెల 15వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ చేస్తున్నారు. హిందీతో పాటు ఇతర భాషలలోను ఈ సినిమా అందుబాటులో ఉంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ జోనర్ లో సాగే కథ ఇది. పవన్ (సైఫ్ అలీ ఖాన్) ఓ సిన్సియర్ పోలీస్ ఆఫీసర్. నిజాయితీ .. క్రమశిక్షణకు నిదర్శనంలా ఆయన కనిపిస్తుంటాడు. తండ్రి హరిహర్ .. తమ్ముడు దిలీప్ .. భార్య వర్ష (రసిక దుగల్) కొడుకు హనీ .. ఇదే అతని కుటుంబం. పవన్ ఫ్యామిలీ నివసిస్తున్న ఆ గ్రామంలో కట్టుబాట్లు చాలా కఠినంగా ఉంటాయి. పరువు హత్యలు ఆ గ్రామంలో ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. అలాంటి పరిస్థితులలో పవన్ తమ్ముడు దిలీప్, ప్రీతి అనే ఒక యువతిని తీసుకుని పారిపోతాడు. ఆనంద్ శ్రీ అనే ఒక స్వామిజీపై అనేక వివాదాలు ఉంటాయి. చాలామంది టీనేజ్ అమ్మాయిలు కనిపించకుండా పోవడం వెనుక ఆయన హస్తం ఉందనేది చాలామంది అభిప్రాయం. స్వామిజీ ముసుగులో అతను చేస్తున్న అరాచకాలను గురించి రాసిన జర్నలిస్ట్ 'రీమా'ను కొంతమంది ఆగంతకులు షూట్ చేసి పారిపోతారు. పవన్ కళ్లముందే ఆమె చనిపోతుంది. 'రీమా'ను షూట్ చేసింది ఒక మైనర్ అని తెలుసుకుని పవన్ షాక్ అవుతాడు. 'రీమా'ను హత్య చేయించిన ఆనంద్ శ్రీ, మైనర్ కుర్రాడైన 'హర్పాల్' ను చంపడానికి తన ప్రధానమైన అనుచరుడైన 'నిర్మల్'ను పంపిస్తాడు. స్వామిజీ మనిషిగా పోలీస్ ఆఫీసర్ 'కేశవ్' కూడా హర్పాల్ కోసం గాలిస్తూ ఉంటాడు. తమ ఊరు పెద్దల కంటపడకుండా దీపక్ – ప్రీతిలను రహస్యంగా ఒక ఇంట్లో దాచిన పవన్, ఆనంద్ శ్రీ మనుషులకు దొరక్కుండా హర్పాల్ ను సిటీ దాటించే ప్రయత్నం చేస్తాడు. అప్పుడు ఏం జరుగుతుంది? అందుకు సమాధానంగా ఏ నిర్ణయాన్ని తీసుకోవడాన్ని పవన్ తన కర్తవ్యంగా భావిస్తాడు? అనేది కథ. జీవితంలో ప్రతి ఒక్కరూ ఎన్నో సమస్యలను .. పరీక్షలను ఎదుర్కుంటూ ముందుకు వెళ్లవలసి ఉంటుంది. అలాంటి పరిస్థితులలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే ఒక అయోమయానికి లోనవడం జరుగుతూ ఉంటుంది. తప్పు తన ఇంట్లో జరిగినప్పుడు .. సమాజంలో జరిగినప్పుడు తీసుకునే నిర్ణయాలు భిన్నంగా ఉంటాయి. కానీ తనవారైనా .. పరాయివారైనా తన కర్తవ్యాన్ని నిర్వహించడమే కరెక్ట్ అనుకునే ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ కథ ఇది. ఈ కథలో దర్శకుడు హీరో ముందు రెండు సమస్యలను ఉంచుతాడు. ప్రేమ పెళ్లిళ్లను వ్యతిరేకించే పెద్దల వర్గానికి ఎదురెళ్లడం. స్వామిజీ ముసుగులో ఆశ్రమం మాటున అక్రమ కార్యకలాపాలను నిర్వహించే వ్యక్తిని ఎదుర్కోవడం. ఒకే సమయంలో ఈ రెండు సమస్యలతో హీరో సతమతమైపోవడాన్ని చూపిస్తూ వెళ్లారు. రెండు వైపుల నుంచి సమస్యలను పతాకస్థాయికి తీసుకుని వెళుతూ, ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. దర్శకుడు ఈ కథలోని రెండు సమస్యలను లోతుగా ఆవిష్కరించే ప్రయత్నాలు చేయలేదు. కథ చివరిలో హీరో తన కర్తవ్య నిర్వహణను చేపడతాడు. అయితే అందుకు ఆయన ఎక్కువ సమయం తీసుకోలేదు. గన్ తీసి ఒక్కొక్కరినీ షూట్ చేస్తూ వెళతాడు. అయితే స్వామిజీ ట్రాక్ కి సంబంధించి అసలు తలకాయలు మాత్రం అలాగే ఉండటం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. మొదటి దగ్గర నుంచి క్లైమాక్స్ కి ముందువరకూ నిదానంగా నడిచిన కథ, ఆ తరువాత హడావిడిగా ముగిసిపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. రొటీన్ కథను రొటీన్ గానే చెప్పడం అసహనాన్ని కలిగిస్తుంది. ఆరిస్టుల నటన గురించి మాట్లాడుకోవడానికి పెద్దగా ఏమీలేదు. ఆ స్థాయి సన్నివేశాలు కూడా పడలేదు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. కథగా చూసుకుంటే ఇది కూడా ఒక పోలీస్ స్టోరీ అంతే. ఇంతకుముందు ఇలాంటి కథలు చాలానే వచ్చాయి. ఆ కథలకు భిన్నంగా వెళ్లడానికి ఎంతమాత్రం ప్రయత్నించని కంటెంట్ ఇది. చాలా తక్కువమంది ఆర్టిస్టులతో .. సింపుల్ బడ్జెట్ లోనే కానిచ్చేశారు. ఎమోషనల్స్ పరంగా .. యాక్షన్ పరంగా ఎక్కడా కనెక్ట్ కాని కథగానే ఇది మిగిలిపోతుంది.

# ఒంటరి తోడేలు కథ



హీరో రామ్ పోతినేని తొలిసారి మెగాఫోన్ పట్టబోతున్నారు. ఇప్పటికే నటనతో పాటు గాయకుడిగా, గీత రచయితగా సత్తాచాటిన ఆయన దర్శకుడిగా ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతున్నారు. తన 23వ సినిమాతో రామ్ పోతినేని దర్శకుడిగా సరికొత్త ప్రయాణాన్ని మొదలుపెడుతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఆయన హీరోగా నటించే ఈ సినిమా సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని 'రాపో' సినిమాటిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని నిర్మించనున్నారు. శుక్రవారం రామ్ పోతినేని జన్మదినం సందర్భంగా స్పెషల్ బర్త్‌డే పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన 'వీర' పాత్రలో కనిపించనున్నారు. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వుల్ఫ్' అనే క్యాప్షన్ ఆయన పాత్ర తాలూకు ఇంటెన్సిటీని ప్రతిబింబిస్తున్నది. మానసిక సంఘర్షణతో కూడిన ఈ పాత్రలో రామ్ అగ్రెసివ్ యాటిట్యూడ్ కలిగిన వ్యక్తిగా కనిపిస్తాడని, ఆయన మేకోవర్ ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని మేకర్స్ చెబుతున్నారు. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి డిసెంబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని వెల్లడించనున్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com